TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 7 జూన్ 2026 | వెల : 4/-



## సెమీ కండక్టర్ పరిశ్రమలకు తెలంగాణ అనుకూలం

**ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించండి**

**భవిష్యత్తు అవసరాలు, సవాళ్లను ఎదుర్కొనేలా 'ఎకో సిస్టం' అభివృద్ధి**

**మలేషియా అత్యున్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్

సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని... ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియా - పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. 'తెలంగాణ- మలేషియా(పెనాంగ్)' మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలెప్ మెంట్ - మిగతా3లో

# హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా ఏర్పాటు

- తెలంగాణ హైడ్రా, ఈగల్ ఫోర్స్‌ను దేశమంతా ఆసక్తిగా చూస్తోంది
- హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- జలవనరుల కబ్జా అడ్డుకునేందుకోసమే హైడ్రాను ఏర్పాటు చేశామని వెల్లడి
- డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనదన్న సీఎం
- ఫామ్‌హౌస్‌ల కోసం చెరువులు ఆక్రమిస్తున్నారు



హైదరాబాద్

హైడ్రా ఏర్పాటుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జలవనరుల కబ్జాలను అడ్డుకునేందుకోసమే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని వివరించారు. బెంగళూరులో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ఈ సందర్భంగా వాటి ఏర్పాటు ఆవశ్యకతను - మిగతా3లో




## ఎస్ఐఆర్ లిస్ట్‌లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దు!

- త్వరలో పలురాష్ట్రాల్లో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియ
- లిస్ట్‌లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దు అయ్యే ఛాన్స్?!



## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 9 మంది మృతి!
- ఫిరోజ్‌పుర్‌లో ట్రక్కు- కంటైనర్ ఢీ
- 15 మందికి తీవ్ర గాయాలు
- ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించిన పోలీసులు
- కేరళలో టెంపో వ్యాన్, టిప్పర్ ఢీ
- ఇద్దరు మృతి- హరియాణాలో బస్సు ప్రమాదం



## దేశవ్యాప్తంగా వానలే వానలు

- తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ వర్షాల హెచ్చరిక
- కేరళలో నైరుతి రుతుపవనాల ప్రవేశంతో వర్షాలు
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలకు ఐఎండీ అలర్ట్
- ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక

## 'మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?'



- ప్రధాని నాయకత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- దేశంలోని ప్రతి వర్గాన్ని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని కాంగ్రెస్ ఆరోపణ
- మహిళలు, రైతులు, దళితులు, ఆదివాసీల హక్కులు దెబ్బతిన్నాయని ఖర్గే వ్యాఖ్యలు

## ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన అనిశ్చితితో ఉంది

- ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఈఏసీ మీటింగ్
- దేశ ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై చర్చ
- ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల వేళ
- ఆర్థిక సలహా మండలి సభ్యులతో సమావేశమైన ప్రధాని మోదీ
- మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.5 వద్ద కొనసాగుతాయి
- కీలకమైన వాణిజ్య మార్గాలు, సప్లై చెయిన్‌లకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి



## ప్రపంచస్థాయి ప్రమాణాలతో కోహెడ మార్కెట్



- ఎవరెంతా ఏడ్చినా ఆర్ఆర్ఆర్, అభివృద్ధి ఆగదు
- సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- కోహెడలో 239 ఎకరాల్లో పండ్ల మార్కెట్ నిర్మిస్తున్న ప్రభుత్వం
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సమీకృత మార్కెట్ నిర్మిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా కోహెడలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ మనకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికంగా పండ్ల మార్కెట్?తో పాటు సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అంశాలపై ఆయన ప్రసంగించారు. నగరంలోని ఫ్రూట్ మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారని గుర్తుచేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయన్న ఆయన ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ - మిగతా3లో



## కాక్రోచ్ పార్టీ భారీ నిరసన

- బొద్దింక మాస్కులతో హాజరైన యువత
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ డిమాండ్
- కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్‌లో భారీ నిరసన
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ డిమాండ్
- బొద్దింకల మాస్కులు ధరించి నిరసన తెలిపిన యువత

## త్వరలోనే నోటిఫికేషన్




- తెలంగాణలో నిరుద్యోగులకు రేవంత్ భారీ గుడ్ న్యూస్..
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు.
- నిరుద్యోగులకు గుడ్ న్యూస్ అందించారు.
- పోలీస్ శాఖలో ఉద్యోగాలపై స్పష్టత ఇచ్చారు
- రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎప్పటినుంచో ఈ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు

హైదరాబాద్

తెలంగాణలోని నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి భారీ శుభవార్త అందించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాల భర్తీపై కీలక ప్రకటన చేశారు. త్వరలోనే 5 వేల పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. అతి త్వరలోనే 5 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వస్తుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67760 - మిగతా3లో

# ఎస్ఐఆర్ లిస్ట్‌లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దు!

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ముగియగా, త్వరలో తెలంగాణలోనూ ప్రారంభం కానుంది. అయితే, ఎస్ఐఆర్ అనంతరం విడుదల చేసిన ఓటరు లిస్ట్?లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా బంగాల్‌లో కొలువుదీరిన సువేందు అధికారి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అనర్హులైన లబ్ధిదారులు, అక్రమ విదేశీ పౌరుల రేషన్? కార్డులను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరా శాఖ ఆదేశాలు జారీ చేసింది. 2026 ఓటరు లిస్టులో అనర్హులుగా తేలిన పీడీఎస్ లబ్ధిదారులను గుర్తించి వారి పేర్లను రేషన్ కార్డు నుంచి తొలగించనున్నారు. వాస్తవానికి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జూన్ 4నే విడుదలయ్యాయి. అంతేకాదు, ఈ ప్రక్రియను త్వరితగతిన జూన్? 15 నాటికి పూర్తి చేయాలని కంకణం కట్టుకుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టంగా సూచించింది. రాష్ట్ర ఆహార పంపిణీ వ్యవస్థలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన అక్రమాలను తొలగించేందుకు ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వంలో ఫుడ్ అండ్? కార్పొరేషన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అశోక్? కిర్తానియా, ఆహార శాఖను పూర్తిగా అవినీతి రహితంగా మార్చాలని పిలుపునిచ్చారు. 'ఖాద్య సాథి' పథకం కింద ఏటా ప్రభుత్వం వెచ్చించే వందల కోట్ల రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టకుండా చూడటమే సువేందు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**లిస్టులో పేరు లేకుంటే రేషన్ కట్?!**

అయితే, బంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అయితే, అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను సవరించడానికి చేపట్టిన 'ఊాణణ' (అందుబాటులో లేనివారు, నివాసం మారినవారు, మరణించినవారు లేదా



నకిలీలు) పరిశీలన ప్రక్రియను ఇప్పుడు రేషన్ కార్డుల రద్దుకు ప్రధాన సాధనంగా ఉపయోగిస్తున్నారు. అయితే, అందుకు సంబంధించి ప్రత్యేకంగా ఐదు కేటగిరీల వినియోగదారులను గుర్తించి వారి కార్డులను రద్దు చేయనున్నారు. మొదటిగా 2015 డిసెంబర్ 16 నాటి డ్రాఫ్ట్ లిస్ట్‌లో లేనివారు, ఫామ్-6 ద్వారా జాబితాలో మళ్లీ పేరు నమోదు చేసుకోని వారి కార్డులు రద్దు అవుతాయి. రెండోది, మ్యాపింగ్ చేయకుండా ఉండి, విచారణ తర్వాత తిరస్కరణకు గురైన వ్యక్తులను ఈ జాబితాలో చేరుస్తారు. ఇక, మూడో, నాల్గవ కేటగిరీల కింద, డ్రాఫ్ట్ లిస్ట్ రెండో దశలో మినహాయించిన వారి కార్డులు, న్యాయపరమైన తీర్పు తర్వాత తొలగించిన వారి కార్డులు ఇకపై చెల్లుబాటు కావు. అంతేకాకుండా, 2026 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీలో 'ఊాణణగా గుర్తించిన వారిని తనిఖీ చేసి కార్డులను రద్దు చేస్తారు.

**కొంతమందికి తాత్కాలిక ఉపశమనం**

అయితే, ఈ కఠిన నిబంధనల నుంచి కొంతమందికి తాత్కాలిక ఉపశమనం లభించనుంది. ఎస్ఐఆర్ ట్రిబ్యునల్‌లో తమ పేరు చేర్చాలని అప్పీల్ చేసుకున్న వారు, లేదా పౌరసత్వ సవరణ చట్టం కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారి రేషన్ కార్డులను ప్రస్తుతానికి అమలులోనే ఉంటాయి. అలాగే వారి దరఖాస్తులు లేదా అప్పీళ్లు పూర్తయ్యే వరకు వారికి ఎప్పటిలాగే రేషన్ సరుకులు అందుబాటులో ఉంటాయి. అయితే, ఈ మినహాయింపు పొందాలంటే లబ్ధిదారులు తమ దరఖాస్తుకు సంబంధించిన సరైన పత్రాలను ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఏరియా ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయికి వచ్చి ఈ పత్రాల నిజానిజాలను స్వయంగా పర్యవేక్షిస్తారు. ఒకవేళ వ్యక్తి తన క్లెయిమ్‌కు మద్దతుగా చెల్లుబాటు అయ్యే పత్రాలను సమర్పించడంలో విఫలమైతే, సంబంధిత అధికారి రేషన్ కార్డు రద్దుకు సిఫార్సు చేస్తారు. దాని ఆధారంగా ఉన్నతాధికారులు తుది నిర్ణయం వెలువరిస్తారు.

# ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన అనిశ్చితితో ఉంది

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్?పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రిజర్వ్? బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ సమావేశం జరగడం గమనార్హం.

**భారత్ వృద్ధి పథం**

కాగా, శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ కీలక ప్రకటనలు చేశారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, సప్లై చెయిన్ అంతరాయాలు ఉన్నప్పటికీ, రెపోరేటును 2.52 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో తాము తటస్థ వైఖరిని అవలంబిస్తున్నామని స్పష్టం చేశారు. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, స్థూల ఆర్థిక పరిస్థితులను సమీక్షించిన తర్వాత, లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ కింద రెపో రేటును మార్చకుండా 5.25 శాతం వద్దే ఉంచాలని ఎంపీసీ నిర్ణయించిందని చెప్పారు. దీని ప్రకారం, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ 5 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.5 వద్ద కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన



అనిశ్చితితో ఉందని, కీలకమైన వాణిజ్య మార్గాలు, సప్లై చెయిన్‌లకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటికి తోడు మార్కెట్ ఒడుదొడుకులు లాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే గతంలో వచ్చిన ఇలాంటి పరిస్థితులతో పోల్చితే, నేడు భారత్? మరింత పటిష్టంగా ఉందని, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న అవాంతరాలను మనదేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వచ్చిన ఒక అవకాశంగా పాలసీదారులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

**ఇంధన దిగుమతులు తగ్గించుకోవాలి!**

పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవుతున్న నేపథ్యంలో, గత నెలలో ప్రధాని మోదీ భారత పౌరులకు 7 విజ్ఞప్తులు చేశారు. ప్రధానంగా దిగుమతి చేసుకునే ఇంధనంపై ఆధారపడడం తగ్గించాలని, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించి, దేశ ఆర్థిక రక్షణకు సహకరించాలని ప్రజలను కోరారు. వీటితోపాటు ఇంటి నుంచి పనిచేయడం (వర్క్? ఫ్రమ్? హోమ్?)కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంధన వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. కనీసం ఒక ఏడాదిపాటు విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వాడాలని, వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్) వైపు మళ్లాలని, బంగారం కొనుగోళ్లను నియంత్రించాలని పేర్కొన్నారు. అంతేకాదు ముడి చమురు ధరల్లో వచ్చే ఒడుదొడుకులను తట్టుకోవడానికి, భారతదేశ రవాణా విధానంలో మార్పు రావాలని ప్రధాని మోదీ కోరారు. మెట్రో, ప్రభుత్వ రవాణా సౌకర్యాలను ఉపయోగించాలని, పెట్రోల్?, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు వాహనాలు తప్పనిసరి అయినప్పుడు 'కార్ పూలింగ్?' పద్ధతిని ఎంచుకోవాలని, వీలైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగాన్ని పెంచాలని సూచించారు. వస్తువుల రవాణా కోసం రైల్వే మార్గాలను వాడుకోవాలని అన్నారు.

**అంచనాలను మించి**

ఇదిలా ఉండగా, జూన్ 5న విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారత ఆర్థిక వ్యవస్థ మార్కెట్ అంచనాలకు మించి రాణించింది. వార్షిక ప్రాతిపదికన వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (రియల్ జీడీపీ) వృద్ధిరేటు 7.8 శాతంగా ఉండగా, పూర్తి సంవత్సర వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదు అయ్యింది. స్థిర ధరల ప్రకారం, 2025-26 నాలుగో త్రైమాసికంలో వాస్తవ జీడీపీ రూ.87.77 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.81.40 లక్షల కోట్ల కోట్ల కంటే చాలా ఎక్కువ. ఇక ప్రస్తుత త్రైమాసికానికి నామినల్ జీడీపీ రూ.94.65 లక్షల కోట్లుగా అంచనా.

# కాక్రోచ్ పార్టీ భారీ నిరసన

దేశ రాజధాని దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది యువత, విద్యార్థులు ఆందోళనలో పాల్గొన్నారు. దేశ విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంచాలని, పరీక్షలు, నియామక ప్రక్రియల్లో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న పలువురు యువకులు బొద్దింకల మాస్కులు ధరించి, చేతుల్లో పూలతో నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు.

**'విద్యా వ్యవస్థపై అసంతృప్తి'**

దేశ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో తాము దిల్లీకి వచ్చినట్లు నిరసనలో పాల్గొన్న మధ్యప్రదేశ్?కు చెందిన విద్యార్థి రాహుల్ ఓఝా 'ఈటీవీ భారత్'?కు తెలిపారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్, సీబీఎస్ఈ, సీయూఈటీ-యూజీ పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై తమ ఆందోళన కొనసాగుతోందని చెప్పారు. ఈ నిరసనల ద్వారా విద్యా వ్యవస్థలో సంస్కరణలు వస్తాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దిల్లీకి చెందిన మరో విద్యార్థి అంకిత్ గౌతమ్ మాట్లాడుతూ, దేశ విద్యా వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు కేంద్ర విద్యాశాఖ బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు. తరచూ జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో లోపాలపై యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. విద్యా వ్యవస్థలో మెరుగుదల కోసం జవాబుదారీతనం అవసరమని, అందుకే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.



**యువత భయపడదంటూ అభిజీత్ వ్యాఖ్యలు**

అమెరికా నుంచి దిల్లీకి వచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే విమానాశ్రయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆత్మకథ పుస్తకాన్ని పట్టుకుని కనిపించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. సభను ఉద్దేశించి మాట్లాడుతూ, దేశ యువత ఇకపై భయపడబోదని, తమ హక్కుల కోసం పోరాడుతుందని అన్నారు. ఈ ఉద్యమం శాంతియుత ప్రజాస్వామ్య పోరాటమని, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం యువత ఏకమవుతోందని పేర్కొన్నారు.

**జవాబుదారీతనం కావాలన్న సీజేపీ**

గత నెల రోజులుగా వెలుగులోకి వచ్చిన పరిణామాలు విద్యాశాఖ పనితీరు, పరీక్షల నిర్వహణలో ఉన్న లోపాలను బయటపెట్టాయని సీజేపీ ప్రతినిధి ఆరోపించారు. ఇటీవల సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ చైర్మన్, కార్యదర్శుల బదిలీలను ప్రస్తావిస్తూ, యువత కోరుకుంటున్నది కేవలం అధికారుల బదిలీలు కాదని, నిజమైన జవాబుదారీతనమని పేర్కొన్నారు. సమస్యల మూల కారణాలను పరిష్కరించే చర్యలే అవసరమని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అవసరమని నిరసనకారులు స్పష్టం చేశారు.

**కట్టుదిట్టమైన భద్రత**

జంతర్‌మంతర్‌లో నిరసన నిర్వహించేందుకు దిల్లీ పోలీసులు అధికారిక అనుమతి ఇచ్చినట్లు సీజేపీ తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధర్నా, ప్రదర్శన చేపట్టేందుకు అనుమతులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన దరఖాస్తు ముందుగానే అందిందని పోలీసులు వెల్లడించారు. నిరసన నేపథ్యంలో జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆందోళన ప్రదేశానికి వెళ్లే రహదారుల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, నగర సరిహద్దు ప్రవేశ ద్వారాలు, ఇతర సున్నిత ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. దిల్లీలో పాటు కీలక ప్రాంతాల్లో వెయ్యికి పైగా పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## దేశవ్యాప్తంగా వానలే వానలు

కేరళలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం వెల్లడించింది. జూన్ 6 నుంచి 12వ తేదీల వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తాజాగా పేర్కొంది. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా కోస్తా ప్రాంతాలు సహా మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించింది. ఇక ఈశాన్య భారతంలోని అన్ని ఏడు రాష్ట్రాల్లో జూన్ 12 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అసోం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని పేర్కొంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అండమాన్ నికోబార్ దీవులు, బంగాల్ బెంగాల్, సిక్కిం ప్రాంతాల్లో కూడా విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో జూన్ 12 వరకు వర్షాలు కొనసాగవచ్చని అంచనా వేసింది.

**భారీ నుంచి అతి భారీ వర్షాలు**

నైరుతి రుతుపవనాల ప్రభావం పశ్చిమ తీర ప్రాంతాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది. కర్ణాటక తీర ప్రాంతాలు, కేరళ, గోవా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో వరుసగా పలురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఆయా రాష్ట్రాల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మరోవైపు దేశ రాజధాని దిల్లీలో గత కొన్ని రోజులుగా వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. వర్షాలు, ఉరుములు, ఈదురుగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తగ్గాయి. శుక్రవారం దిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణ స్థాయి కంటే 4.2 డిగ్రీలు తక్కువ. కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

శనివారం దిల్లీలో పాక్షిక మేఘావృత వాతావరణం కొనసాగుతుందని ఐఎండీ అంచనా వేసింది. తేలికపాటి వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, మత్స్యకారులు ప్రత్యేక అప్రమత్తత పాటించాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి అరేబియా సముద్రానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, కొన్ని సందర్భాల్లో అవి 65 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని పేర్కొంది.

## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

పంజాబ్‌లో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పికప్? ట్రక్కు-కంటైనర్ ఢీకొన్న ఘటనలో 9 మంది మృతిచెందారు. 15 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఒక బాలుడు ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ట్రక్కులో దాదాపు 25 మందికి పైగా ఉన్నారని, వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఫాజిల్కా- ఫిరోజ్‌పుర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. జలాలాబాద్?లో ఒకే కుటుంబానికి చెందిన సుమారు 27 మంది, తమ కుటుంబ సభ్యురాలి అస్థికలను నిమజ్జనం చేయడానికి అమృత్‌సర్‌లోని దేరా బియాస్?కు శనివారం ఉదయం బయలుదేరారు. అయితే, ట్రక్కు డ్రైవర్? వాహనంపై నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న పికప్ వ్యాన్‌ను ఢీకొట్టాడని, అనంతరం కొంత దూరం ఈడ్చుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**నుజ్జు నుజ్జు అయిన పికప్ ట్రక్కు**

అయితే, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యల్లో పాల్గొన్నారు. వాహనంలో చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలోనే నలుగురు మరణించారని, మరో నలుగురు ఆసుపత్రికి తరలించే మార్గంలో మృతిచెందారని పోలీసులు తెలిపారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, పోస్టుమార్టం జరుగుతోందని చెప్పారు. అలాగే, గాయపడిన వారిలో కొంతమందిని ఫరీద్?కోట్?కు రిఫర్? చేశారు. అయితే, ప్రమాద తీవ్రతకు పికప్? ట్రక్కు నుజ్జు నుజ్జు అయ్యిందని తెలిపారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**టెంపో వ్యాన్, టిప్పర్ ఢీ**

అలాగే, కేరళలోని మళప్పురం జిల్లాలో మరో ఘటన జరిగింది. టెంపో వ్యాన్, టిప్పర్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో 20 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. కోజికోడ్-పాలక్కాడ్ రహదారిపై పెరియంబలం సమీపంలోని పుల్లిక్కల్ వద్ద అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మృతులు, టెంపో వ్యాన్ డ్రైవర్ రాజు (38), ప్రయాణికురాలు రమణి (65)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ పాలక్కాడ్ నివాసితులని చెప్పారు. అయితే, ప్రమాదానికి గురైన వ్యాన్‌లో సుమారు 25 మంది ప్రయాణికులు ఉన్నారని, వారంతా తీర్థయాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. అయితే, ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో భారీ వర్షం కురుసిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. మరోవైపు, టెంపో వ్యాన్‌లోని 16 మంది ప్రయాణికులు కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చేరారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. టిప్పర్ లారీ డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులు కొండోట్టిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారని పోలీసులు తెలిపారు. కాగా, ఈ విషయంపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**హరియాణాలో బస్సు ప్రమాదం- 8 మందికి గాయాలు**

హరియాణాలో బస్సు ప్రమాదం జరిగింది. దిల్లీ నుంచి మనాలికి వెళ్తున్న బస్సు హరియాణాలోని కర్నాల్ జిల్లాలో జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కనీసం ఎనిమిది మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. దిల్లీ-మనాలి వెళ్తున్న వోల్వో బస్సు ఒక ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టిందని, అనంతరం మరో ట్రక్కు, ట్రాక్టర్?ను ఢీకొట్టిందని పేర్కొన్నారు. గాయపడిన వారిని తారావోరి సివిల్ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. అయితే, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

## 'మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?'

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. దేశంలోని అన్ని వర్గాల ప్రజల హక్కులు, ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆరోపించిన కాంగ్రెస్, అసలు మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారంటూ ప్రశ్నించింది. మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, విద్యార్థులు సహా సమాజంలోని ప్రతి వర్గం ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోతోందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్?లో ఖర్గే పాత ప్రసంగానికి సంబంధించిన ఓ వీడియోను పంచుకుంది. ఆ వీడియోలో రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను విస్మరిస్తోందని ఆరోపించారు. సమానత్వం, సామాజిక న్యాయం వంటి ప్రాథమిక సూత్రాలను పక్కనపెట్టి దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. "మీరు ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు? ప్రజల పన్నుల డబ్బుతో అనేక పథకాలు ప్రారంభించి ప్రచారం చేయడం ద్వారా కొంతకాలం ప్రజలను మభ్యపెట్టవచ్చు. కానీ మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థుల హక్కులను దెబ్బతీశారు. దీంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు" అని ఖర్గే పేర్కొన్నారు. అదే సమయంలో ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కూడా కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇంధన ధరల పెంపును తీవ్రంగా తప్పుబట్టారు.


# త్వరలోనే నోటిఫికేషన్

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. దేశంలోనే అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలను తమ ప్రభుత్వమే భర్తీ చేసిందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తాము గర్వంగా చెప్పుకుంటామన్నారు.

**రేవంత్ గుడ్ న్యూస్**

ప్రస్తుతం రాష్ట్రంలోని యువత ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం అవుతుందన్నారు. అయితే ఇటీవల జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ ఏకంగా 3 జాబ్ నోటిఫికేషన్లను ప్రకటించి నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. రోడ్లు, భవనాలు, కాలుష్య నియంత్రణ మండలి శాఖలో ఖాళీగా ఉన్న 290 అసిస్టెంట్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. అలాగే ఆర్అండ్బీ శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (సివిల్) పోస్టులతో పాటు 49 ఏఈఈ ఎలక్ట్రికల్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కానుకగా నిరుద్యోగులకు తీపికబురు అందించింది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు 44 ఏళ్ల గరిష్ట వయో పరిమితి విధించింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ శనివారం మరో ప్రకటన చేశారు. 5 వేల పోలీస్ ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్ వస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పోలీస్ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేయలేదు. ఇప్పుడు ఆ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు.

**త్వరలోనే నోటిఫికేషన్**

ఎప్పుడెప్పుడు పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వస్తుందా అని నిరుద్యోగులు ఎరుచూస్తున్నారు. ఇప్పుడు ఎట్టకేలకు సీఎం రేవంత్ నుంచి నోటిఫికేషన్ రావడంతో ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ నెలలో లేదా వచ్చే నెలలో పోలీస్ శాఖలోని ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశముంది. దీంతో నిరుద్యోగులు ఇప్పటినుంచే ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు.

# ఆపరేషన్ లోటస్ ప్రారంభం

**హైదరాబాద్ :** తెలంగాణలో బీజేపీ పుంజుకునే ప్రయత్నంలో పడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ లను తట్టుకుని తెలంగాణలో ముందుకు రావడం అంత సులువు కాదు. అందుకే రానున్న కాలంలో బీజేపీలో కీలక నేతలను ఆ పార్టీల నుంచి చేర్చుకునే అవకాశముంది. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారీగా తెలంగాణలో బీజేపీ సర్వేలు చేయిస్తుంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ గెలుపు గుర్రాలకు మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం అవసరమైతే ఇతర పార్టీల నేతలను కూడా ఆహ్వానించి వారికి కండువా కప్పేయాలని డిసైడ్ అయింది. దక్షిణాదిన బలపడాలనుకుంటున్న బీజేపీ తెలంగాణను లక్ష్యంగా చేసుకుంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావించి పార్టీ కేంద్ర నాయకత్వం తరచూ రాష్ట్ర నాయకులతో సమావేశమవుతున్నారు. నేతలంతా సమైక్యంగా నిలిచి ఇతర పార్టీల నేతలను ఆహ్వానించేందుకు అవసరమైన స్కెచ్ లను రూపొందించాలని ఇప్పటికే రాష్ట్ర పార్టీ నేతలకు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణలో గత శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను, పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే. మరికొంత గట్టిగా ప్రయత్నిస్తే ఈసారి అధికారంలోకి రావడం ఖాయమని అంటున్నారు. బీఆర్ఎస్ లో కీలక నేతలను రప్పించడానికి కూడా కేంద్రం స్థాయిలో నేతలు పావులు కదుపుతున్నారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఊపందుకుంది. ఇప్పటికే పార్టీ నాయకత్వంపైన, మరోసారి అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేని కొందరు నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్లు గుర్తించిన అధినాయకత్వం త్వరలోనే ఆపరేషన్ ను ప్రారంభించే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొందరు నేతలు బీజేపీ టాప్ లీడర్లతో టచ్ లోకి వెళ్లారని, అయితే సర్వే నివేదికలు వచ్చిన తర్వాత మాత్రమే వీరి చేరికలు ఉంటాయని చెబుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో బీజేపీ భారీ స్కెచ్ తో ముందుకు వెళుతుంది. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

**నార్త్ తెలంగాణ...**

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ ఒక నిశ్శబ్ద విప్లవానికి తెరలేపింది. గతంలో తాము జెండా పాతిన దుబ్బాక, హుజూరాబాద్లతో పాటు ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో కాషాయ దళం ప్రయోగించిన హైపర్ లోకల్ గ్రౌండ్ స్ట్రాటజీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ప్రత్యర్థుల వ్యూహాలకు చిక్కకుండా, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్



పునాదులను కదిలించేలా బీజేపీ మాస్టర్ ప్లాన్ వేసింది. ప్రస్తుతం తెలంగాణ పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు, స్థానిక కమిటీల నియామకాలు, పాత సివిల్ వివాదాల చుట్టూ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ రెండు పార్టీల గ్రూపు తగాదాలతో విసిగిపోయిన తటస్థ ఓటర్లను, ఏ వర్గంలోనూ చేరలేక ఇబ్బంది పడుతున్న సగటు గ్రామీణ యువతను బీజేపీ చాకచక్యంగా తన వైపు తిప్పుకుంటోంది. స్థానికంగా ఎవరు గెలిచినా పాత కక్షలు తప్పవని.. అదే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో నడిస్తే పొలిటికల్ ప్రొటెక్షన్ ఉంటుందని వివరిస్తోంది. బలమైన భరోసాను ఇస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కేడర్ నైరాశ్యాన్ని క్యాష్ చేసుకుంటోంది. పెద్దగా ప్రెస్ మీట్లు పెట్టకుండానే, ఊళ్లల్లో ప్రత్యామ్నాయ శక్తులుగా బీజేపీ స్థానిక నాయకత్వం ఎదుగుతోంది. ఉత్తర తెలంగాణ రాజకీయాలను ఎప్పుడూ కుల సమీకరణాలే శాసిస్తాయి. దీనిని పక్కాగా అర్థం చేసుకున్న కాషాయ దళం.. ఈ సారి సరికొత్త సోషల్ ఇంజనీరింగ్కు తెరలేపింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో కింది సామాజిక వర్గాలను టార్గెట్ చేసింది. బలమైన బీసీ సామాజిక వర్గాలైన మున్నూరు కాపు, పద్మశాలి, యాదవ, గౌడ, ముదిరాజ్ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమవుతోంది. దళిత, గిరిజన ఉపకులాల స్థానిక పెద్దలతో చర్చలు జరుపుతోంది. గ్రామంలో ఐదారు కుటుంబాలను లేదా కనీసం 10 ఓట్లను ప్రభావితం చేయగల సామర్థ్యం ఉన్న ఈ కీలక వ్యక్తులను బీజేపీ నేతలు నేరుగా కలిసి మాట్లాడుతున్నారు. వారి సామాజిక సమస్యల పరిష్కారానికి తాము ఉన్నామంటూ ఒక సామాజిక అనుబంధాన్ని ముమ్మరంగా పెంచుకుంటున్నారు. ఈ మైక్రో లెవెల్ ప్లానింగ్ వల్ల పైకి ఓటర్లు సైలెంట్గా ఉన్నా, లోపల మాత్రం కాషాయం వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో ఉండే యువజన సంఘాలు, డిజిటల్ నెట్వర్క్లను బీజేపీ లీడర్లు అత్యంత చాకచక్యంగా వాడుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ పతాక స్థాయి పథకాలు, ఉపాధి అవకాశాలను వివరిస్తూ వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. వ్యవసాయ రంగంలో స్థానిక రైతు గ్రూపులతో మమేకమవుతూ.. పంటల కొనుగోళ్లు, స్థానిక మౌలిక వసతుల లోపాలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలుగా ప్రొజెక్ట్ చేయడంలో సక్సెస్ అవుతున్నారు. ఫలితంగా, యూత్ క్లబ్‌లు, రచ్చబండల దగ్గర పొలిటికల్ డిస్కషన్స్ నెమ్మదిగా బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయి. ఈ నిశ్శబ్ద ఆపరేషన్ అంతా తక్షణ హడావుడి కోసం కాదు, రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి ఉత్తర తెలంగాణను బీజేపీకి బలమైన కోటగా మార్చడమే దీని ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ అధికార బలంతో, బీఆర్ఎస్ పాత క్యాడర్ బలంతో కొట్టుకుంటుంటే.. బీజేపీ ఏకంగా ఓటు బ్యాంక్ పునాదులనే మార్చేస్తోంది. క్షేత్రస్థాయిలో కుల సంఘాల మద్దతు, తటస్థుల భరోసా తోడైతే, రాబోయే రోజుల్లో ఉత్తర తెలంగాణలో బీజేపీని ఢీకొట్టడం ప్రత్యర్థులకు అంత సులువు కాదనేది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేలు

**అదిలాబాద్ :** తెలంగాణలో కొత్తగా మరో రెండు జాతీయ రహదారులకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సీసీఈఏ (ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ) సమావేశంలో ఆమోదించారు. ఈ రెండు నేషనల్ హైవేలలో ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల (ఎన్‌హెచ్–63), జగిత్యాల–కరీంనగర్ (ఎన్‌హెచ్–563) సెక్షన్ల అభివృద్ధి చేయనున్నారు. ఎన్‌హెచ్ఏఐ గత ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు హైవేలకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు ప్రక్రియను పూర్తి చేసింది. సీసీఈఏ ఆమోదంతో ఈ ఏడాది పనులు ప్రారంభంకానున్నాయి. తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేల కోసం రూ.7,597.16 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. మూడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం 190 కిలోమీటర్ల పొడవున నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నారు. జగిత్యాల–కరీంనగర్ హైవేను బీవోటీ పద్ధతిలో నిర్మిస్తారు. ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల (ఎన్‌హెచ్–63) పనులను హ్యామ్ పద్ధతిలో పూర్తి చేస్తారు. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే ఆర్మూర్–మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం దాదాపుగా గంటన్నర వరకు



తగ్గుతుందని చెబుతున్నారు. అలాగే జగిత్యాల–కరీంనగర్ మధ్య హైవేతో 45 నిమిషాలు తగ్గనుందంటున్నారు. ఈ రెండు జాతీయ రహదారుల్ని పీఎం గతిశక్తి పథకానికి అనుగుణంగా రూపొందిస్తున్నారు. ఈ రెండు నేషనల్ హైవేలను పలు ప్రాజెక్టులకు అనుసంధానం చేయనున్నారు. వీటిలో ఆర్థిక కేంద్రాలు, సామాజిక కేంద్రాలు, లాజిస్టిక్ కేంద్రాలు కూడా ఉన్నాయిఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల నేషనల్ హైవే 63 నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మీదుగా వెళుతుంది. జగిత్యాల–కరీంనగర్ నేషనల్ హైవే విషయానికి వస్తే.. పోతారం, గంగాధర, కరీంనగర్ వరకు వెళుతుంది. ఈ హైవేలలో బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. గంటలకు 100 కిలోమీటర్లు స్పీడ్ వెళ్లేలా రోడ్లను డిజైన్ చేశారు. ఈ రెండు హైవేలు ఫిషింగ్ సీఫుడ్ క్లస్టర్, పలు రైల్వే స్టేషన్‌లను కనెక్ట్ చేయనున్నాయి. మొత్తం మీద త్వరలోనే కొత్త జాతీయ రహదారులు నిర్మాణం కాబోతున్నాయి. వాస్తవానికి సీసీఈఏ సమావేశంలో ఈ రెండు జాతీయ రహదారులతో పాటుగా ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు సంబంధించి ఆమోదం లభిస్తుంది అనుకున్నారు.. ఆ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.. ఆమోదం లభించలేదు.

## హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి వివరించారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్‌హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారని, తమ భవనాల నుంచి వచ్చే వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారని ఆయన తెలిపారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో మూడు వేల మందితో హైడ్రాను ఏర్పాటు చేసినట్లుగా వివరించారు. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా ఆ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నామని చెప్పారు. మత్తుపదార్థాల నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనదని రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు.

**యువతరం నైపుణ్యాలు పెంచుకోవాలి**

ఉపాధి విషయంలో మారుతున్నటువంటి పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలన్న రేవంత్ రెడ్డి, ఆయా రంగాల్లో నైపుణ్యాలను పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వివరించారు. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారని ఆయన వివరించారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్ అని ఆయన అభిప్రాయపడ్డారు. యువతరం వాటిపై దృష్టి సారించాలని సూచించారు. అందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. "పేద ప్రజలు చెరువులను ఆక్రమించారంటే అర్థం చేసుకోగలం. ధనికులు విలాస భవనాల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. ఫామ్‌హౌస్‌ల కోసం చెరువులు, జలవనరులు కబ్జా చేస్తున్నారు. తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రా ఏర్పాటు చేశాం. ఎవరు ఆక్రమించినా ఏమాత్రం ఆలోచించకుండా నేలమట్టం చేస్తున్నాం"

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో కోహెడ మార్కెట్

-మొదటిపేజీ తరువాయి

నిర్మిస్తానని నాడు తాను ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చానన్నారు. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేవిధంగా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మార్కెట్ మనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాగేందుకు నీళ్లు ఉండవు, నిలబడే చోటు లేదని వివరించారు. అలాంటి వాటన్నింటిని దృష్టిలో ఉంచుకునే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నామన్నారు. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే అంతర్జాతీయ నగరం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఎవరెంత ఏడ్చినా ఆర్ఆర్ఆర్, అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నామని పేర్కొన్నారు. వరి వేస్తే ఉరే అని చెప్పే రోజులు ఇవి కావన్నారు. రైతులకు వరిపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కాళేశ్వరం కూలేశ్వరం అయినా దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నామని వివరించారు. రైతులు ఏవిధంగా వడ్లు పండించినా అవి కాళేశ్వరం నీళ్లతోనే అని దుష్ప్రచారం చేశారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కారు పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్ని చేసినా చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదని బీఆర్ఎస్?ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు

**అందుకే కూరగాయల ధరలు పెరుగుతున్నాయి**

ఒకప్పుడు నగరానికి సరపడా కాయగూరలు, పాలు రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చేవని, ఓఆర్ఆర్, విమానాశ్రయం వచ్చాక ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫలితంగా రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయం కుంటుపడిందని చెప్పారు.

రైతులు కేవలం వరి, జొన్నలు, పత్తి, మిర్చి పంటలే పండిస్తున్నారన్న సీఎం పరిమితంగా సాగు చేయడం వల్లే కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయన్నారు. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీని వద్దని, ఫ్యూచర్?సిటీని నిర్మిస్తున్నామన్నారు. మహానగరాన్ని నిర్మించి ప్రపంచ వ్యాప్తంగా 500 కంపెనీలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. తాము అభివృద్ధి చేస్తుంటే, మేం రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్? చెబుతోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "67,000 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి యువత ఆకాంక్షలు నెరవేర్చాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేడీతోనైనా దిల్లీలో ఉన్న మోదీతోనైనా కొట్లాడతా. నేను పదవి నుంచి దిగిపోవాలని కిషన్‌రెడ్డి అంటున్నారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ పదవి దిగిపోవాలి. మోదీ దిగిపోయి రాహుల్‌గాంధీ ప్రధాని అయితే మనకు నిధులు వస్తాయి. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేస్తే మన మెట్రో రైలుకు, ఆర్?ఆర్?ఆర్?కు నిధులు వస్తాయి"– రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

**ప్రపంచస్థాయి ప్రమాణాలతో కోహెడ మార్కెట్**

హైదరాబాద్ నగర శివారు ప్రాంతం కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్? కొలువు దీరబోతోంది. ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో సాంకేతిక హంగులతో కూడిన మార్కెట్ నిర్మాణానికి, ఇంటిగ్రేటెడ్ సబ్?రిజిస్ట్రార్ కార్యాలయాలకు సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. కోహెడలో 239 ఎకరాల్లో పండ్ల మార్కెట్?ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మొత్తం 3387.35 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సర్కారు నిర్మిస్తోంది.

**కోహెడ మార్గంలో నిలిచిన రాకపోకలు**

మరోవైపు సీఎం పర్యటన దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో కొహెడ–హయత్?నగర్ మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సంఘీ నుంచి ఓఆర్?ఆర్ సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు వాహనాలను నిలిపివేయడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## సెమీ కండక్టర్ పరిశ్రమలకు తెలంగాణ అనుకూలం



-మొదటిపేజీ తరువాయి

తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. 'గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ డెస్టినేషన్'గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణ ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్‌కు ఉన్న అనుభవం... గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం" అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.

## సంపాదకీయం

# భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు

భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి బలమైన వృద్ధిని నమోదు చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విడుదలైన ప్రొవిజనల్ అంచనాల ప్రకారం దేశ స్థూల దేశీయోత్పత్తి 7.7 శాతం వృద్ధి చెందింది. నామినల్ జీడీపీ 8.9 శాతం పెరిగింది. తయారీ, సేవలు, వాణిజ్య రంగాల అద్భుత ప్రదర్శనతో ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించగా, వ్యవసాయం, మత్స్య రంగాలు కూడా కీలక పాత్ర పోషించాయి.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, భారత్ మరోసారి తన ఆర్థిక శక్తిని చాటుకుంది. గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రొవిజనల్ అంచనాల ప్రకారం దేశ స్థూల దేశీయోత్పత్తి 7.7 శాతం వృద్ధి నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన 7.1 శాతం వృద్ధితో పోలిస్తే ఇది మరింత మెరుగైన ఫలితం. ముఖ్యంగా తయారీ, సేవలు, వాణిజ్య రంగాల అద్భుత ప్రదర్శన దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించగా, వ్యవసాయం, మత్స్య రంగాలు కూడా కీలక పాత్ర పోషించాయి.ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు మందగమన ఒత్తిడిని ఎదుర్కొంటున్న సమయంలో భారత్ 7.7 శాతం వృద్ధిని నమోదు చేయడం దేశ ఆర్థిక పునాదులు ఎంత బలంగా ఉన్నాయో చూపిస్తోంది. దేశీయ వినియోగం పెరగడం, పెట్టుబడులు విస్తరించడం, పారిశ్రామిక ఉత్పత్తి పెరగడం వంటి అంశాలు ఈ వృద్ధికి దోహదపడ్డాయి. జీడీపీ అంటే ఒక దేశంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి అయిన అన్ని వస్తువులు, సేవల మొత్తం విలువ. ఒక దేశ ఆర్థిక ఆరోగ్యాన్ని కొలిచే ప్రధాన ప్రమాణంగా జీడీపీను పరిగణిస్తారు పెరగడం అంటే ఆర్థిక కార్యకలాపాలు విస్తరించడం, ఉద్యోగాలు పెరగడం, ఆదాయాలు మెరుగుపడటం వంటి సంకేతాలను ఇస్తుంది.ప్రొవిజనల్ అంచనాల ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో రియల్ స్థిర ధరల వద్ద రూ.323.12 లక్షల కోట్లకు చేరుకుంది. 2024–25లో ఇది రూ.299.89 లక్షల కోట్లుగా ఉంది. మరోవైపు నామినల్ (ప్రస్తుత ధరల వద్ద) రూ.346.36 లక్షల కోట్లకు చేరుకుని 8.9 శాతం వృద్ధిని నమోదు చేసింది.ఇది కేవలం సంఖ్యల పెరుగుదల మాత్రమే కాదు. దేశంలో ఉత్పత్తి, వినియోగం, పెట్టుబడులు, సేవల రంగ కార్యకలాపాలు మరింత విస్తరించాయని సూచించే సంకేతం.దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించడంలో సేవల రంగం మరోసారి ప్రధాన పాత్ర పోషించింది. బ్యాంకింగ్, బీమా, రియల్ ఎస్టేట్, ఐటీ, కమ్యూనికేషన్, రవాణా, హోటళ్లు, వాణిజ్య రంగాల్లో నమోదైన వృద్ధి ఆర్థిక వ్యవస్థకు బలాన్ని ఇచ్చింది. సేవల రంగం 9.3 శాతం వృద్ధిని నమోదు చేయడం ద్వారా జీడీపీ పెరుగుదలలో అత్యధిక వాటా అందించింది. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ కూడా దీనికి తోడ్పడింది.'మేక్ ఇన్ ఇండియా', ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి చర్యల ప్రభావంతో తయారీ రంగం బలంగా ముందుకు సాగుతోంది. తయారీ, వాణిజ్యం, రవాణా, కమ్యూనికేషన్ వంటి రంగాలు రెండంకెల వృద్ధి నమోదు చేయడం దేశ పారిశ్రామిక సామర్థ్యం పెరుగుతున్నదనే సంకేతం.పారిశ్రామిక, సేవల రంగాలతో పోలిస్తే వ్యవసాయ రంగ వృద్ధి తక్కువగా ఉన్నప్పటికీ, 3.2 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని అందించింది. ముఖ్యంగా వ్యవసాయం, మత్స్య రంగాలు ప్రాథమిక రంగ వృద్ధికి కారణమయ్యాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడటం దేశీయ వినియోగాన్ని పెంచడంలో కూడా సహకరించింది.ఆర్థిక నిపుణులు ఎక్కువగా గమనించే సూచికల్లో ఒకటి. ఇది దేశంలో కొత్త ఫ్యాక్టరీలు, యంత్రాలు, మౌలిక వసతుల నిర్మాణం వంటి పెట్టుబడులను సూచిస్తుంది. 2025–26లో ఉఈఅఈ 7.5 శాతానికి పైగా వృద్ధి నమోదు చేయడం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని సూచిస్తోంది. ఇదే భవిష్యత్తులో ఉద్యోగాల సృష్టికి, ఆర్థిక విస్తరణకు బాటలు వేస్తుంది.2025–26 ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలలు (జనవరి–మార్చి) కూడా దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని నిరూపించాయి.అమెరికా, యూరప్, చైనా వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలు వృద్ధి మందగమనాన్ని ఎదుర్కొంటున్న సమయంలో భారత్ 7.7 శాతం ఉఆఖ వృద్ధిని నమోదు చేయడం విశేషం. ప్రపంచ పెట్టుబడిదారులకు, అంతర్జాతీయ సంస్థలకు ఇది సానుకూల సంకేతంగా మారింది.ఆర్థిక వ్యవస్థలో సేవలు, తయారీ, పెట్టుబడులు, వినియోగం వంటి కీలక రంగాలు ఒకేసారి బలపడటం భారత వృద్ధికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. రాబోయే సంవత్సరాల్లో కూడా ఇదే ఊపు కొనసాగితే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే లక్ష్యానికి మరింత చేరువ కానుంది.రాబోయే ఆర్థిక సంవత్సరంలో వివిధ త్రైమాసికాల వారీగా జీడీపీ వృద్ధి రేటు హెచ్చుతగ్గులతో సాగనుందని ఆర్‌బీఐ నివేదిక స్పష్టం చేస్తోంది. ఇందులో భాగంగా మొదటి త్రైమాసికంలో వృద్ధి రేటు 6.6 శాతంగా నమోదవుతుందని అంచనా వేయగా, అది రెండూ త్రైమాసికం నాటికి స్వల్పంగా తగ్గి 6.3 శాతానికి పరిమితం కానుంది. అయితే ఆ తర్వాత నుంచి ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకుని మూడో త్రైమాసికంలో 6.5 శాతానికి, ఇక ఆఖరిదైన నాలుగో త్రైమాసికంలో అత్యధికంగా 6.8 శాతానికి చేరుకుంటుందని ఆర్‌బీఐ లెక్కగట్టింది.మరోవైపు దేశంలో ఆహార ఉత్పత్తుల ధరలు , వాటి లభ్యతపై ప్రస్తుతం అనిశ్చితి కొనసాగుతోందని ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నైరుతి రుతుపవనాల అంచనాలు, అలాగే 'ఎల్ నినో' ప్రభావం వల్ల వ్యవసాయ రంగానికి ఇబ్బందులు ఎదురై, ఆహార రంగంపై తీవ్ర ఒత్తిడి ఉంటుందని గవర్నర్ వివరించారు. దేశంలో ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని సమీక్షా కమిటీ అభిప్రాయపడింది. అయినప్పటికీ, ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, అంతర్జాతీయ , దేశీయ మార్కెట్లపై మరింత స్పష్టత వచ్చే వరకు వేచి చూడడమే ఉత్తమమని ద్రవ్య విధాన కమిటీ భావించినట్లు గవర్నర్ స్పష్టం చేశారు.

# యుద్ధం ఉన్నట్టా... లేనట్టా?!



అయోమయాన్ని సృష్టించటానికీ, అవతలి పక్షంపై పైచేయి సాధించటానికీ ఎంతకైనా తెగించే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈసారి అమెరికన్ కాంగ్రెస్‌కు పెద్ద అబద్ధం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇరాన్‌తో శత్రుత్వాన్ని ఆపి, అక్కడున్న సేనలనువెంటనే వెనక్కి పిలిపించాలని 215--208 ఓట్ల తేడాతో బుధవారం అమెరికన్ కాంగ్రెస్ తీర్మానించగా, 'అసలు యుద్ధం ఎక్కడుంది? అది ఏప్రిల్ మొదటి వారంలోనే ముగిసి పోయింది. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అది కొనసాగుతోంది'అంటూ ట్రంప్ లేఖ రాశారు. ఇజ్రాయెల్‌తో కుమ్మక్కై, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై మొదలు పెట్టిన దండయాత్ర ఇప్పటికీ ఆగలేదు. హోర్మూజ్ జలసంధి ఇంకా తెరుచుకోలేదు. తమ షరతులకు తలొగ్గితేనే ఒప్పందం సాధ్యమంటూ ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ తీర్మానానికి కొన్ని గంటలముందు కూడా అమెరికా దాడులకు ప్రతీకారంగా కువైట్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. కానీ ఈ ఘర్షణల్ని యుద్ధంగా పరిగణించరాదని ట్రంప్ భాష్యం చెబుతున్నారు. నిజానికి యుద్ధం ఆపాలని ప్రతినిధుల సభ ఆదేశించినంత మాత్రాన ట్రంప్‌కొచ్చే నష్టమేం లేదు. ఆ తీర్మానం చట్టపరంగా కీలకమైన చర్యే కావొచ్చు, కానీ ఆచరణలో అదే మంత పనికొచ్చేది కాదు. నలుగురు రిపబ్లికన్ సభ్యులు డెమాక్రాట్లతో చేయి కలపటంతో తీర్మానం ఆమోదం పొందింది. 1973లో వచ్చిన యుద్ధ అధికారాల చట్టంకిందకాంగ్రెస్ అనుమతి లేకుండా అధ్యక్షుడు యుద్ధంలోకి దిగితే, రెండు నెలల్లో దాన్నిముగించాల్సి ఉంటుంది. ఒకవేళ యుద్ధం ఇంకా కొనసాగించాల్సిన అవసరం ఉందని భావిస్తే మరో 30 రోజులు పొడిగించటానికి అధ్యక్షుడికి వెసులుబాటుంది. కానీ అటు తర్వాత మాత్రం అసాధ్యం. ట్రంప్ రాసిన లేఖ ప్రకారం నిండా నెలకుమించి యుద్ధం సాగలేదు! కాల్పుల విరమణ అమల్లో ఉందంటే యుద్ధం లేనట్టేననీ, 'అవసరమైన'సందర్భాల్లో చేస్తున్న దాడుల్ని యుద్ధంగా పరిగణించరాదనీ యుద్ధ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ వాదిస్తున్నారు. తలా తోకా లేకుండా మాట్లాడటంలో ట్రంప్ సిద్ధహస్తుడు. ఒకపక్క కాంగ్రెస్ చేసిన తీర్మానం దేశభక్తి రాహిత్యమంటూనే, అదే నోటితో అదెప్పుడో ముగిసిందని చెబు తున్నారు. ఆయన తర్కం ప్రకారం యుద్ధం చేయటమే దేశభక్తి అయితే, దాన్ని నిలి పేసిన తనకూ దేశభక్తి లోపించినట్టే. ఈ వాదప్రతివాదాల మాటెలావున్నా ఇలాంటి అధ్యక్షుణ్ణి నెత్తిన పెట్టుకున్నందుకు మున్ముందు ఆ దేశం భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఈ నెలాఖరుతో యుద్ధం వంద రోజులకు చేరుతుంది. యుద్ధం ఆగేందుకు ఇప్పటికి నాలుగుసార్లు ప్రతినిధుల సభలో డెమాక్రాట్లు తీర్మానాలు పెట్టారు. కానీ మొదటి మూడుసార్లూ అవి వీగిపోయాయి. మూడోసారి తీర్మానమైతే 212--212తో ఎటూతేలకుండా ముగిసింది. ఈసారి అది నెగ్గినా ట్రంప్ తన తర్కంతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. యుద్ధంవల్ల ఇరాన్‌లో ఇంతవరకూ 3,400 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, 13 మంది అమెరికన్ సైనికులు మరణించారు. 2,900 కోట్ల డాలర్లు ఖర్చయిందని పెంటగాన్ చెబుతుండగా, ఇదంతా ముగిసేసరికి లక్ష కోట్ల డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ మూర్ఖత్వం ఇలాగే కొనసాగితే అమెరికా నిండా మునగటం ఖాయం. దాంతో పాటు డాలర్‌తో ముడిపడివున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ దివాలా స్థితికి చేరుకుంటాయి. ఇంధనం, ఎరువుల ధరలు ఆకాశాన్నంటి ఇప్పటికే ట్రంప్ రేటింగ్ నేల చూపులు చూస్తోంది. ప్రతినిధుల సభ చేసిన తీర్మానంవంటిదే రిపబ్లికన్ల ఆధిక్యతగల సెనేట్‌లో కూడా చేస్తే అమెరికా అధ్యక్షుడి సంతకం అవసరం లేకుండానే యుద్ధం ఆపాల్సి ఉంటుంది. అయితే అలాంటి సందర్భం ఎదురైనప్పుడు సైతం దాన్ని ట్రంప్ వీటో చేయొచ్చని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ తీర్మా నిస్తే తప్ప ఇవన్నీ పెద్దగా పనికొచ్చేవి కాదు. ఇప్పటికే మొత్తం ఓటర్లలో 64 శాతంమంది ట్రంప్ యుద్ధోన్మాదాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. తటస్థ ఓటర్లలో అయితే 73 శాతంమంది యుద్ధం ఆపాలని కోరుకుంటున్నారు. ఎవరెంతగా కోరుకున్నా ట్రంప్ మాత్రం స్వీయ వినాశనంవైపే అమెరికాను తీసుకుపోతున్నారు.

# మాటలు రైతులకు.. మూటలు ఢిల్లీకి



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడిచిపోయాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఆ పార్టీ ఇచ్చిన హామీల అమలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా ఉన్నది. ఆరు గ్యారంటీలు, రైతులకు, యువతకు, ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు ఇచ్చిన డిక్లరేషన్లు మొత్తంగా మ్యానిఫెస్టోలోని 420 హామీల అమలు అంతా నీటి మూటలు, ఒట్టి ప్రగల్భాలే అని తేలిపోయింది. రైతులు, వ్యవసాయకూలీలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయిస్, ఆర్టీసీ సిబ్బంది, ఆటోడ్రైవర్లు ఇలా వివిధ వర్గాల వారు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకొని, గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు కూడా అటకెక్కడంతో మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించింది. బీఆర్‌ఎస్ రూ.లక్ష వరకే రుణమాఫీ చేసిందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే రూ.2 లక్షల రుణమాఫీ అని, బీఆర్‌ఎస్ రైతుబంధు ఎకరానికి ఏటా రూ.10వేలు మాత్రమే ఇచ్చిందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని, కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని, పది రకాల పంటలకు రూ.500 వరకు బోనస్, పంట నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని ఓటర్లను ఆకర్షించింది. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కింది. తమను ఆదరించిన రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిలువునా ఇప్పుడు ముంచుతున్నది. హామీలకు సంబంధించి కాంగ్రెస్ సర్కార్ రైతులకు రూ.లక్ష కోట్ల వరకు బకాయి పడింది. ఆరు గ్యారంటీలపై సీఎం సంతకం, క్యాబినెట్ తీర్మానం, చట్టబద్ధత కల్పిస్తామంటూ ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదు. రైతులకు కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో సర్కార్ ఉన్నది. రైతుల నుంచి సగం ధాన్యం ప్రభు త్వం కొనకపోవడంతో, రైతులు యాసంగి సీజన్‌లో 65 లక్షల టన్నుల ధాన్యాన్ని తక్కువ ధరకే మిల్లర్లకు విక్రయించాల్సి వచ్చింది.

రుణమాఫీ కాని రైతుల కోసం ప్రభుత్వం 2026–27 బడ్జెట్‌లో నయాపైసా కేటాయించలేదు. దీంతో రాష్ట్రంలో రైతు రుణమాఫీ ముగిసిన కథ అయిపోయింది. వాస్తవానికి, రూ.రెండు లక్షల వరకు రుణాలు కలిగిన 42 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. కానీ, ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. ఈ లెక్కన ఇంకా 16.65 లక్షల మంది రైతులకు రూ.10,384 కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉన్నది.

లక్షల మంది రైతులకు రూ.వేల కోట్లు పెండింగ్‌లో ఉండగా రుణమాఫీ పూర్తయినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో లేని గొప్పలు చెప్పుకోవటం రైతులను నిలువునా మోసం చేయడమే. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాగానే 2026 ఫిబ్రవరి 18న రైతుభరోసా నగదు బదిలీ ఉంటుందని సీఎం పలు సభల్లో ప్రకటించారు. కానీ ఆ మాటలు నీటి మూటలే అయ్యాయి.

ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 10న రిజర్వ్ బ్యాంక్ నుంచి రూ.9 వేల కోట్లు అప్పు తీసుకున్నది. ఈ డబ్బు రైతు భరోసా కోసమేనని ప్రభుత్వ పెద్దలు చెప్పుకొన్నారు. రైతు భరోసా డబ్బులు చెల్లించి, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. కానీ మున్సిపల్ ఎన్నికలు ముగియగానే రైతు భరోసా నిధులు అందరికీ విడుదల చేయలేదు. కానీ మూడెకరాల వరకే పరిమితమైంది. ఈ రైతు భరోసా నిధులు దారి తప్పి రాహుల్ భరోసా అయిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. రైతుల కోసం అని చెప్పిన రూ.9 వేల కోట్లు, ప్రభుత్వ పెద్దలకు కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపు కోసం దారి మళ్లాయనే ఆరోపణలున్నాయి. కమీషన్లుగా వచ్చిన వెయ్యి కోట్ల రూపాయలను ఇటీవల కేరళ, తమిళనాడు, అసోం, బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖర్చు కోసం తరలించి ఉంటారని ప్రచారం జరుగుతున్నది.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు సీజన్లకు గాను రెండు సీజన్లకు పూర్తిగా, రెండు సీజన్లలో సగం మంది రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులు, రెండు సీజన్లకు రైతు భరోసా డబ్బులను పూర్తిగా ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కార్, ఇక కౌలు రైతులకైతే భరోసా పథకం పూర్తిగా ఎగవేసింది. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు స్కీమ్ బంద్ అయితదని అంటున్నరు. ఎందుకు బందయితది? మేమేమన్నా దివానాగాళ్లమా, మాకు దిమాక్ లేదా?' అని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మరిపుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు అయింది. సగం సీజన్లకు రైతుభరోసాను ఎగ్గొట్టింది. అంటే రేవంత్‌రెడ్డి మాటల ప్రకారమే సర్కార్ పెద్దలు ఏంటో వాళ్లే ఆలోచించుకోవాలి.

ప్రతిసారీ ఏవో ఎన్నికలు ఉన్నప్పుడే అరకొర రైతుభరోసా పేరుతో ప్రభుత్వ పెద్దలు హడావుడి చేస్తున్నారు. అంటే ఎన్నికలు ఉంటనే రైతు భరోసా ఇస్తారా? పంటలు వేసిన ప్రతిసారీ ఇవ్వరా? ఈ లెక్కన మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగకపోతే, ఇక రైతుభరోసా స్కీమ్ కూడా రద్దయినట్టేనా అనే కలవరం రైతుల్లో మొదలైంది. రైతుభరోసా అసలు కొనసాగుతుందని అన్నదాతలకు భరోసా ఇవ్వాలంటే ప్రభుత్వం ఈ యాసంగి, వానాకాలం సీజన్లవి కలిపి ఒకేసారి ఇదే నెలలో రైతుభరోసా నిధులు విడుదల చేయాలి. గతంలో ఎగ్గొట్టిన బకాయిలను కూడా పూర్తిగా చెల్లించి తీరాల్సిందే.

రైతు డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి పది లక్షల మంది ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలి. కానీ ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికలో కొర్రీలు పెడుతూ కేవలం 5.19 లక్షల పైచిలుకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇందులో 2024–25 రబీ సీజన్‌లో 84 వేల మందికి మాత్రమే రూ.6 వేల చొప్పున, ఒక సీజన్‌కే ఆత్మీయ భరోసా అమలు చేసింది. మిగిలిన 4.35 లక్షల మందికి ఆత్మీయ భరోసా ఎగ్గొట్టింది. వీరందరికీ తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.6 వేలు విడుదల చేయాలి. 2025 ఖరీఫ్ సీజన్‌తోపాటు, తాజాగా ముగిసిన 2025–26 రబీ సీజన్, ఇపుడు ప్రారంభమవుతున్న ఖరీఫ్ సీజన్, మొత్తం మూడు సీజన్లకు కలిపి, మొత్తం లబ్ధిదారులకు మూడు విడతల ఆత్మీయ భరోసా నిధులు రూ.18 వేల చొప్పున ఇవ్వాలి. లబ్ధిదారుల సంఖ్యను పెంచి, కనీసం 25 లక్షల మంది రైతు కూలీలకైనా ఆత్మీయ భరోసా అమలు చేయాలనేది రైతు కూలీల డిమాండ్.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని తెలిపింది. పార్టీ మ్యానిఫెస్టోలో వరితోపాటు మక్క, కందులు, సోయాబీన్, పత్తి, మిర్చి, పసుపు, చెరుకు, జొన్నలు వంటి పంటలకు కూడా బోనస్ ఇస్తామని నమ్మబలికింది. కానీ ఒక్క వరిపంటకు, అదీ సన్న రకానికి మాత్రమే బోనస్ అని ప్రకటించి, దొడ్డు రకం వడ్లను సాగు చేసే రైతులను మోసం చేసింది.

2024 ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సన్నాలకు బోనస్‌ను అమలు చేయడంతో వరి రైతులు 2024–25 రబీ సీజన్‌లోనూ బోనస్ దక్కుతుందని రైతులు అనుకొని, సన్నరకం వరి సాగు చేశారు. కానీ, అన్నదాతల ఆశలు అడియాసలే అయ్యాయి. యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముగిసి ఏడాదిదాటినా ఇప్పటి వరకు రైతులకు దక్కాల్సిన బోనస్ డబ్బులు రూ.1160 కోట్లు విడుదల చేయలేదు. కనుక ఆ పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలి. తాజాగా ధాన్యం సేకరణ ముగుస్తున్న యాసంగి సీజన్ సన్నరకం వడ్లతోపాటు, దొడ్డురకానికి, మ్యానిఫెస్టోలో చెప్పిన హామీ మేరకు ఇతర పంటలకు కూడా బోనస్ ఇవ్వాలనేది అన్నదాతల డిమాండ్.

రైతులు మాత్రమే కాదు, కాంగ్రెస్ హామీలను నమ్మి ఆ పార్టీకి ఓటేసిన వివిధ వర్గాలన్నీ ఇపుడు తాము నమ్మకద్రోహానికి గురయ్యామని రగిలిపోతున్నారు. నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థినులు, ఎస్సీ, ఎస్టీలు, ఆటోడ్రైవర్లు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా ప్రతీ వర్గం కాంగ్రెస్ తమను దగా చేసిందని మండిపడుతున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ సర్కార్ సగం పాలనా కాలంలోనే కోల్పోయింది. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలన చూసాక, రాష్ట్ర ప్రజలకు ఇది దగాకోరు, నయవంచన సర్కార్ అని ప్రజలకు స్పష్టమైన అవగాహన వచ్చింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల పాలనలో బంగారు తెలంగాణ కల సాకారం కోసం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసింది. కాంగ్రెస్ అదనంగా పథకాలు అమలు చేస్తామంటే నమ్మిన ప్రజానీకం, ఇప్పుడు మొండిచేయి చూపిన పార్టీకి తగినబుద్ధి చెప్పేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారు.

# వరి పంట పండించడమే పాపమా.







చిన్న ఘనాపూర్ రైతుల ఆవేదన..

**కొల్చారం,జూన్06(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్ ప్రాథమిక సొసైటీ ముందు మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై చిన్న ఘనాపూర్ గ్రామ రైతులు లారీల కోసం శనివారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఒకవైపు వర్షాలు,మరోవైపు లారీల కొరత,ఇదేం గోస అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.మేము వరి పంట పండించడమే పాపమా దేవుడా అంటూ వారి బాధను వెల్లబోసుకున్నారు. వరి కోసి రెండు నెలలు అవుతున్నప్పటికీ కూడా ఇప్పటివరకు వరి ధాన్యం లారీలు రాక తూకం వేయడం లేదని,తూకం వేసిన 600బస్తాలు ఉన్నాయని రైతులు తెలిపారు.లారీలు రాక ఒక తిప్పలు,సాయంత్రం అయితే చాలు వర్షం ఎప్పుడు వస్తుందో అని రైతుకు గుండెలు పగిలేలా భయపడుతున్నామని రైతులు తెలిపారు.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చిన్న ఘనాపూర్ కొనుగోలు సెంటర్కు లారీల సమస్య తీర్చాలని చిన్న ఘనపూర్ రైతులు తెలిపారు.ధర్నా చేసిన ఘటన తెలుసుకున్న కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మొహీనుద్దీన్ చిన్న ఘనపూర్ ఘటన స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేయగా రైతులు మాత్రం ఏమాత్రం తగ్గకుండా రైతులు రోడ్డుపైనే కూర్చున్నారు .వెంటనే ఎస్ఐ కొల్చారం తాహసి ల్దార్ తో మాట్లాడానని వెంటనే మీ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని,అలాగే అన్లోడింగ్ అయ్యేలా,లారీలు వచ్చేలా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మంద నాగయ్య, టిఆర్ఎస్ పార్టీ నాయకులు బొబ్బిలి సందీప్ కుమార్,డైరెక్టర్ సోమనర్సింలు,మాజీ వార్డ్ మెంబర్ కమ్మరి మల్లేశం,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో గాలివారిగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం..





గ్రామాభివృద్ధి,సమస్యల పరిష్కారమే ధ్యేయం..
సర్పంచ్ నారెడ్డికవిత సుదర్శన్ రెడ్డి
సీజనల్ వ్యాధులు,పోషకాహారంపై అవగాహన..
గాలివారిగూడెంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభ...

**మరిపెడ,జూన్06(సూర్యరేఖ)** ప్రజలందరి సహకారంతో గాలివారిగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సర్పంచ్ నారెడ్డి కవితసుదర్శన్ రెడ్డి అన్నారు.ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సభను నిర్వహించారు.గ్రామ సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో గ్రామ పరిశుభ్రత,మొక్కల పెంపకం,ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ,పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత,సహజ వనరుల సంరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డిమాట్లాడుతూ...గ్రామాభివృద్ధి, సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు .ప్రజాపాలన- ప్రగతిప్రణాళిక ద్వారా గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి,వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ప్రజల అభీష్టం,అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతామని తెలిపారు.ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆమె కోరారు.అనంతరం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ...వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డెంగ్యూ, మలేరియా,టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ఇళ్లు,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి విషయంలో జాగ్రత్తలు వహించాలని అవగాహన కల్పించారు.అదేవిధంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉష మాట్లాడుతూ...మహిళలు, గర్భిణులు,బాలింతలు,చిన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించడానికి పౌష్టికాహారం (న్యూట్రిషన్)ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను,పోషక విలువలు గల ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి,ఏఈ, అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,గ్రామ పెద్దలు,మహిళలు, గ్రామస్తులు ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీప్రైమరీ పీఎంశ్రీ కేంద్రాలను రద్దు చేసి అంగన్వాడీ కేంద్రాలకు అప్పగించాలి..

పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి..
ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి..
సీఐటీయూ డిమాండ్..




**మరిపెడ,జూన్06(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్రీ ప్రైమరీ పీఎంశ్రీ కేంద్రాలను తక్షణమే రద్దు చేసి అంగన్వాడీ కేంద్రాలకు అప్పగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుండి వీరన్న,అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ, మరిపెడ ప్రాజెక్టు కార్యదర్శి కుమ్మరికుంట్ల జ్యోతి,లు డిమాండ్ చేశారు.శనివారం సీఐటీయూ,అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూని ఆధ్వర్యంలో తమ సమస్యలపై మరిపెడ మండల కేంద్రంలో తహశీల్దార్,ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి,ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుండి వీరన్న,అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ,మరిపెడ ప్రాజెక్టు కార్యదర్శి కుమ్మరికుంట్ల జ్యోతి మాట్లాడుతూ...ఐసీడీఎస్ వ్యవస్థను పరిరక్షించాలంటే ఫ్రీప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను అంగన్వాడీలకు అనుసంధానం చేయాలని కోరారు.అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందడం లేదని,వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేసి ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.24 రోజుల సమ్మె ఒప్పందం ప్రకారం మరణించిన టీచర్లు,హెల్పర్ల కుటుంబాలకు రూ.2లక్షల ప్రమాద బీమా తక్షణమే చెల్లించాలని,అంగన్వాడీ కేంద్రాలకు తగిన వసతులు కల్పించి సొంత భవనాలు నిర్మించాలని కోరారు.అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జీవో నెం.14ను రద్దు చేసి అంగన్వాడీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,2017నుంచి పెండింగ్లో ఉన్న టీఏలు ,డీఏలు, ఇంక్రిమెంట్లు,ఇన్చార్జి అలవెన్సులు తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.అంగన్వాడీ ఉద్యోగుల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఇతర సంఘాలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మరిపెడ ప్రాజెక్టు సీనియర్ నాయకురాలు రమాదేవి,సహాయ కార్యదర్శి పుష్ప,ఉపాధ్యక్షురాలు ఉమా,సహాయ కార్యదర్శి కలమ్మ,సోషల్ మీడియా కన్వీనర్ కవిత,నాయకులు శ్రీలత,సీఐటీయూ మండల నాయకుడు కొండ ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

పరిశుభ్ర,హరిత బెల్లంపల్లి నిర్మాణానికి ప్రజల సహకారం అవసరం..




**బెల్లంపల్లి,జూన్06(సూర్యరేఖ)**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) చంద్రయ్య శనివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0పనులు,పంప్ హౌస్, జాతికుంట చెరువును ఆకస్మికంగా తనిఖీ చేసి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రజాపాలన--99రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన వార్డు సభల్లో మున్సిపల్ చైర్పర్సన్ దావా స్వాతిరమేష్, కమిషనర్ తన్నీరు రమేష్,లు మాట్లాడుతూ... పట్టణ పరిశుభ్రత,పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని,సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.అలాగే పోలీసులు రోడ్డు భద్రత,డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్,సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు.ప్రజల సహకారంతో పరిశుభ్రమైన, సురక్షితమైన,హరిత బెల్లంపల్లి నిర్మాణానికి అందరూ కృషి చేయాలని అధికారులు కోరారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి ముష్యం శ్రీనివాస్



**ఉప్పల్,జూన్06(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం,కార్యకర్తల సమన్వయం ,ప్రజాస మస్యల పరిష్కారానికి మరింత వేగం చేకూర్చే లక్ష్యంతో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జిగా ముష్యం శ్రీనివాస్ ని నియమించారు.ఈ సందర్భంగా సైనిక్పురిలోని ఎమ్మెల్యే నివాసంలో ముష్యం శ్రీనివాస్ శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని,డివిజన్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు.తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకానికి ముష్యం శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ ఆశయాలు మరియు నాయకత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు ప్రజలకు సేవ చేస్తూ,పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని ముష్యం శ్రీనివాస్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సుద్దాల హనుమంతు జయంతి సందర్భంగా కాంగ్రెస్ నేత నాగారం వేణుగౌడ్ ఘన నివాళులు..



**నాంపలి ,హైదరాబాద్,జూన్06 (సూర్యరేఖ)** స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రజా కళాకారుడు ,తెలంగాణ వైతాళికుడు సుద్దాల హనుమంతు జయంతి సందర్భంగా ప్రముఖ న్యాయవాది ,కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గుడిమల్కాపూర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నాగారం వేణుగౌడ్ ఆమహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాగారం వేణుగౌడ్ మాట్లాడుతూ...తన కలంతో ప్రజల్లో చైతన్యం నింపి,తన గళంతో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సుద్దాల హనుమంతు సమాజంలో అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడి, సమానత్వం ,స్వేచ్ఛ,సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు.ఆయన జీవితం మనకు ధైర్యం, నిబద్ధత ,ప్రజాసేవ వంటి విలువలను నేర్పుతుందని వేణు గౌడ్ పేర్కొన్నారు ,సుద్దాల హనుమంతు ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోని సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని నాగారం వేణుగౌడ్ పేర్కొన్నారు.

# పీఎస్ కాలనీలో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జూన్06(సూర్యరేఖ)** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పీఎస్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులు,అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి శనివారం పర్యటించారు.ఉప్పల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేగా ఆయన స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీలోని డ్రైనేజీ సమస్యలు,సీసీ రోడ్ల నిర్మాణం,పార్కు అభివృద్ధి పనులు,సీసీ కెమెరాల ఏర్పాటు మరియు కరెంట్ పోల్స్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అంతర్గత రహదారుల అభివృద్ధి కోసం సీసీ రోడ్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా పార్కును ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీలో భద్రతను పెంపొందించేందుకు కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.వీధి దీపాల కోసం అవసరమైన పోల్స్ ఏర్పాటుపై కూడా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, పీఎస్ కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వరరావు,స్థానిక నాయకులు, అధికారులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉప్పల్ డివిజన్ మల్లికార్జున్ నగర్ కాలనీ డ్రైనేజ్ సమస్య..



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి--సమస్య పరిష్కారానికి హామీ..



**ఉప్పల్,జూన్06(సూర్యరేఖ)**ఉప్పల్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కాలనీ, ఎస్.ఎన్.కాలనీ,శేషసాయినగర్ కాలనీ,ఫ్రెండ్స్ కాలనీ ప్రాంతాల్లో నెలకొన్న తీవ్రమైన డ్రైనేజ్ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో శనివారం ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు మార్నేని ఫణీంద్ర ఆధ్వర్యంలో ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు.కాలనీల ప్రధాన సమస్య అయిన డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా,ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను సంబంధిత అధికారులతో చర్చించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.అలాగే నాలా విస్తరణ పేరుతో కాలనీ వాసులకు నోటీసులు జారీ చేసి భయాందోళనలకు గురిచేస్తున్న అంశంపై కూడా ఎంపీ స్పందించారు. మధ్యతరగతి కుటుంబాలు బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మించుకున్న ఇళ్లను ప్రభుత్వం ఏకపక్షంగా కూల్చివేసే పరిస్థితి రానీయబోమని, ప్రజల హక్కులను కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని కాలనీ వాసులకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్,ఓబీసీ మోర్చా అధ్యక్షులు అమరేందర్, యువ మోర్చా అధ్యక్షులు ఆడెపు రమేష్,ఎస్సీ మోర్చా అధ్యక్షులు జయరాం,గిరిజన మోర్చా అధ్యక్షులు రాజు నాయక్,సోషల్ మీడియా కన్వీనర్ అభిరామ్, కాలనీల అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు సత్తిరెడ్డి,రంగారెడ్డి,నగేష్,ఓబుల్ రెడ్డి, సమ్మయ్య,నారాయణరెడ్డి,వెంకటేష్,సోమిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,సదానంద్, భూపతి,అంజయ్య, తిమ్మారెడ్డి,సత్యంకాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి..

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు





**ఉట్నూర్,జూన్06(సూర్యరేఖ)** గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు అన్నారు. ప్రజాపాలన-ప్రగతినివేదిక కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామపంచాయ తీలలో గ్రామసభలను పకడ్బందీగా,పారదర్శకంగా నిర్వహించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ),ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు అన్నారు.శనివారం ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జాదవ్ అనిత శ్రీనివాస్ సమక్షంలో సమావేశంలో ఆయన గ్రామసభల నిర్వహణ విధానం,అనుసరించాల్సిన మార్గదర్శకాలు, చేపట్టాల్సిన చర్యలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్,వార్డు సభ్యులతో పరిచయం చేసుకొని, గ్రామసభలను ప్రజల భాగస్వామ్యంతో సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థుల సమస్యలు,అవసరాలు,అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి తీసుకునే నిర్ణయాలను పారదర్శకంగా నమోదు చేయాలని తెలిపారు.గ్రామసభలో తీసుకున్న తీర్మానాలు,నిర్ణయాలను తప్పనిసరిగా నిర్ణయ్ యాప్‌తో పాటు సంబంధిత ప్రభుత్వ పోర్టల్‌లలో సకాలంలో అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలు,సూచనలు ప్రభుత్వానికి చేరడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికగా అవి పనిచేస్తాయని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని,ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు మరింత విజయవంతమవుతాయని ఆయన అన్నారు. గ్రామస్థాయిలో ప్రజా పాలనను బలోపేతం చేయడంలో గ్రామసభలు అత్యంత ముఖ్యమైనవని, ప్రతి గ్రామపంచాయతీలో వాటి నిర్వహణను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మంద కృష్ణ మాదిగను కలిసిన రాంపూర్ గ్రామ నాయకులు..



**చెన్నూర్,జూన్06(సూర్యరేఖ)** దళిత జాతి దళపతి,పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను శనివారం హైదరాబాద్‌లో రాంపూర్ గ్రామనాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి పలు ప్రజాసమస్యలు,సామాజిక అంశాలపై సుమారు గంటపాటు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ మానుమాండ్ల రమేష్, మాజీ సర్పంచ్ నారాయణ,వినోద్,నరేష్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక 99రోజులు ముగింపు..

కల్లూరు మున్సిపాలిటీ 16వ వార్డుసభ

విజయవంతమైన 16వ వార్డుసభ ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్




**ఖమ్మం,జూన్06(సూర్యరేఖ)** కల్లూరు అంబేద్కర్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కల్లూరు మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రరావు హాజరయ్యారు. ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు,వృద్ధాప్య పెన్షన్లు,డ్రింకింగ్ వాటర్,విద్యుత్ సమస్యలు కౌన్సిలర్,కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా వాటిని అతి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, మున్సిపాలిటీ బిల్ కలెక్టర్,మెప్మా, అంగన్వాడి,ఆశ సిబ్బంది,అధిక సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు

## సోమరాజ్ సింగ్ చొరవతో వీధి లైట్ల మరమ్మతు..



**నాంపల్లి,హైదరాబాద్,జూన్06 (సూర్యరేఖ)** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సూచనలు,సలహాల మేరకు అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయని గోషామహల్ డెవలప్మెంట్ ఇంచార్జ్,బీజేపీ గోషామహల్ డివిజన్ అధ్యక్షుడు సోమరాజ్ సింగ్ అన్నారు.ఈ సందర్భంగా గోషామహల్ డివిజన్ పరిధిలోని ధూల్పేట్, రామ్కరణ్ సింగ్ గల్లి పాఅంతల ల్లో14బై 10బ్లాక్ లో మున్సిపాప్ వీధి లైట్ల మరమ్మతులో వెలగని ఎల్ఈడి లైట్ల సమస్య పరిష్కరిస్తూ,నూతన లైట్లను వేయించడం,సరిదిద్దబడిందన్నారు.

## రైతాంగంపై కేంద్రం నిర్లక్ష్యం వీడాలి..

ఎరువుల ధరలు తగ్గించి పూర్తి సబ్సిడీపై విత్తనాలు అందించాలి

ఏఐయూకేఎస్



**కారేపల్లి,జూన్06( సూర్య రేఖ)** రైతాంగ సమస్యలను పరిష్కరించి,పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకే ఎస్)డిమాండ్ చేసింది. సంఘం ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సింగరేణి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి గుగులోతు తేజనాయక్ మాట్లాడుతూ...ఎల్‌నినో ప్రభావంతో ఈఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని,రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను పూర్తి సబ్సిడీపై అందించాలని కోరారు.రాష్ట్రంలో వరి, జొన్న,మొక్కజొన్న, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు తదితర పంటల విత్తనాలు అవసరమైన మేరకు అందడం లేదని పేర్కొన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలనే నిబంధనలను అమలు చేసి,కారేపల్లి, కామేపల్లి మండలాల రైతులకు కూడా పూర్తిస్థాయిలో సబ్సిడీ ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పుల్లకాని సత్తిరెడ్డి,వడ్డే వెంకటేశ్వర్లు,బాలునాయక్,రావుల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలు బడులో ఉండాలి..





**కుమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,జూన్06(సూర్యరేఖ)** ఆసిఫాబాద్ మండలం లోని పాడిబంద గ్రామ పంచాయతీలోని వట్టివాగు గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆత్రం ఈశ్వరి దీనకర్,పిఎంఆర్ సిపిసిఎంఓ పూర్కా ఉద్దవ్ ఆధ్వర్యంలో ఎస్సిఆర్పిలు రాథోడ్ రవీందర్, కూడ్మేత అనంత్ ఉపాధ్యాయులు కుమరం మాధవ్ రావ్,ఆచార్యజయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించడం జరిగింది.కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాల బాలికలు స్కూల్ కాంప్లెక్స్,ఫరిదిలో బడిబాట కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈసందర్భంగా ఏసిఎంఓ పూర్కా ఉద్దవ్ విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతూ...ఈవిద్య సంవంత్సరంలో తప్పకుండ బడి ఈడు పిల్లలు,మరియు బడి బయట పిల్లలు అందర్నీ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ చేయించాలని,అదే విధంగా ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండే విధంగా మా ఉపాధ్యాయులు గ్రామాన్ని మ్యాపింగ్ చేసి ప్రతి ఇంటికి వచ్చి ప్రతి విద్యార్థికీ పాఠశాలకు వచ్చే విదంగా కార్యక్రమం నిర్వహిస్తారని అంగన్వాడీ సెంటర్ లో ఉన్నా బడి ఈడు పిల్లలను నమోదు చేసుకుంటామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఆంగ్లమాద్యమంలో విద్యా అందిస్తుందని ఈసందర్బంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు రెండు జతలు ఏకరూప దుస్తులు అందించడం జరిగింది అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో సన్నబియ్యంతో భోజనం మరియు అట పాటలతో విద్యా అందించడమే కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని,అదే విధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆంగ్ల మాద్యమంలో విద్యను అందించి గిరిజన విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తున్నామన్నారు.గిరిజన ప్రాథమిక పాఠశాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్ని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమరం మాధవరావ్,మాజీ ఏంపిటీసి ఉయిక శంకర్,ఆత్రం దీనకర్,ఆత్రం వినోద్,ఉయిక జంగు, కొట్నాక్ సాగర్,అంగన్వాడీలు పంచాయతీ సెక్రటరీ గ్రామస్తులు సిడాం కైలాష్ నైతం కైలాష్,ఆత్రం, యస్వంత్ రావ్,ఎస్ హెచ్ జి సంఘం సభ్యులు యూవత తదితరులు పాల్గొన్నారు.

# చేప ప్రసాదం పంపిణీలో భక్తులకు ఇబంధులు లేకుండా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి..

అందుబటులో లక్షా నలుబై వేల కొర్రమీనుచేప పిల్లలు..



**నాంపల్లి,హైదరాబాద్,జూన్06(సూర్యరేఖ)** మృగశిర కార్తెను పురస్కరించుకుని బత్తిని కుటుంబ సభ్యులు ప్రతి సంత్సరం జూన్ 8న హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో చేప ప్రసాదం(చేప మందు)పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ సందర్బంగా మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్,లతో కలిసి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాట్లను పరిశీలించారు.మృగశిర కార్తె సందర్భంగా చేప ప్రసాదం స్వీకరించేందుకు దేశ నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తరఫున నాణ్యమైన కొర్రమీనుచేప పిల్లలు లక్షా నలుబై వేలు వరకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో అందుబటులో ఉంచడం జరుగుతదని,ఏర్పాట్లను పకడ్బందీగా ఉండేలా అన్నిశాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీకి సంబంధించిన కౌంటర్లు,భారీకేడ్ లను పరిశీలించి క్యూలైన్లో వచ్చే భక్తులకు వేసవి దృష్ట్యా ఫ్యాన్లు కూలర్లు ఏర్పాటు చేయాలని,వారికీ ఎలాంటి ఇబ్బందులు,అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.చేప ప్రసాదం పంపిణీ ఈసారి 8వ తేదీ రాత్రి 9గంటలకు ప్రారంభం అవుతుండడంతో కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.క్యూలైన్ లలో తొక్కిసలాట జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని,ట్రాఫిక్ నియంత్రణ అమలులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని,వాట్సప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షణ,కంట్రోల్ రూమ్ ద్వారా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు.అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అంబులెన్స్ లు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ క్యాంపులు,అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.క్యూలైన్ మద్యలో సిపిఆర్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ,షిటీమ్స్ ఏర్పాటు,పిక్ పాకెట్ జరగకుండా అప్రమత్తంగా ఉండేలా అనౌన్స్ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.చేప ముందుకు వచ్చే వారికీ తాగునీరు ఇబ్బందులు రావద్దని,ప్రతి సంవత్సరం మాదిరిగానే వచ్చిన భక్తులకు స్వచ్ఛంద సంస్థలు ఉదయం అల్పాహారం,ఆహారాన్ని అందించడం జరుగుతోందనిప్రజలు తప్పక స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

# చంద్రుపట్లలో 46మంది మత్స్యకారులకు గుర్తింపు కార్డు పంపిణీ చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే



**ఖమ్మం,జూన్06(సూర్యరేఖ)** కల్లూరు మండలం చంద్రుపట్లలో మత్స్య పారిశ్రామిక సంఘం నూతన సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ డాక్టర్ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ చేతుల మీదుగా జరిగింది.గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నూతనంగా మత్స్య పారిశ్రామిక సంఘంలో నూతన సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి మాట్లాడుతూ...గత ఎన్నికల్లో తమకు మంచి మెజారిటీ గెలిపించినటువంటి ఈగ్రామాన్ని మోడ్రన్ గ్రామంగా తీర్చిదిద్దామని గతంలో 32ఇల్లు ఇచ్చామని,రూ.30 లక్షల సిసి రోడ్లు ఇచ్చామని,200 పైగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని,ఇంకా కొన్ని ప్రతిపాదనలు ఉన్నాయని అన్ని హామీలు పూర్తి చేస్తామని అన్నారు.నూతనంగా గుర్తింపు కార్డులు పొందినటువంటి మత్స్యకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి,కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్,కల్లూరు మండల అధ్యక్షులు కోట్రు అర్జున్ రావు,స్థానిక నాయకులు ఏఎంసీ డైరెక్టర్ లింగనబోయిన పుల్లారావు,మాజీ ఎంపిటిసి కుక్క,నాగమ్మ, వార్డు సభ్యులు దుగ్గిరాల సీతారాములు,జీనుగు విజయదాసు,నాయకులు కాటమనేని బాబురావు,తూము నరసింహారావు, వల్లపు నేను అప్పారావు,గద్దె భాస్కరరావు, లింగనబోయిన బోయిన సూరయ్య,పైళ్ల నాగేశ్వరరావు,గంధం చిరంజీవి,తిప్పారెడ్డి రామనరసింహారావు,నెల్లూరు జగదీష్,కోలా సత్యనారాయణ, లింగనబోయిన నాగేశ్వరరావు, తిప్పారెడ్డి జగన్నాథం,బూసి శీను, తిప్పారెడ్డి నరసింహారావు,ఆముదాల వెంకటేశ్వరరావు లింగనబోయిన వెంకటనారాయణ,తిప్పారెడ్డి నరేంద్ర,తిప్పారెడ్డి శ్రీను,తిప్పారెడ్డి నాగరాజు, తిప్పారెడ్డి బాలకృష్ణ,వెంకటకృష్ణ నాగరాజు, తిప్పారెడ్డి మహేష్,కోల వీరబాబు,దంతాల ఉదయ్ కిరణ్,లింగనబోయిన భానుప్రకాష్,తిప్పారెడ్డి రామకృష్ణ ,ఆముదాల ముత్యాలరావు పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్ వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం..

గిద్దవారిగూడెం ప్రజాపాలన గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి చందన్ కుమార్



**కారేపల్లి,జూన్06(సూర్యరేఖ)**గిద్దవారిగూడెం గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన--99రోజుల ప్రణాళిక గ్రామసభలో సింగరేణి మండల ప్రత్యేక అధికారి చందన్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లు,పెన్షన్లు,తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు.వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ప్రతి ఒక్కరూ మిషన్ భగీరథ తాగునీటిని వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,గ్రామాభివృద్ధికి అధికారులు--ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వరప్రసాద్, గ్రామపంచాయతీ సర్పంచ్ ఈసం వెంకటేశ్వర్లు,వ్యవసాయ అధికారి అశోక్ కుమార్,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్,ఇరిగేషన్ ఏఈ, వ్యవసాయ విస్తరణ అధికారులు,సివిల్ సప్లై ఆర్ఐ వీరయ్య,డీలర్ల సంఘం అధ్యక్షుడు బద్రునాయక్, గ్రామపంచాయతీ స్థాయి అధికారులు,పాలకవర్గ సభ్యులు,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మైలారం మల్లన్నకు మొక్కులు చెలించుకున్న రాజు యాదవ్ వారి స్నేహితులు..



**అందోల్,జూన్06(సూర్యరేఖ)**మైలారం మల్లన్న దైవదర్శనంకు జీర్లపల్లి కురుమ రాజుయాదవ్ ఆధ్వర్యంలో మధుయాదవ్ రిపోర్టర్ మల్లేష్ యాదవ్ అమర్నాథ్ స్వామి,శ్రీనివాసరెడ్డి కలిసి మైలార్ మల్లన్నస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.వారికీ ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు.పూర్ణకుంభంతో అభిషేకం నిర్వహించారు.మల్లేష్ యాదవ్ తెలంగాణ రాష్ట్రము లోని ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో పాడి పంటలు బాగా పండాలని మల్లన్న స్వామికి మొక్కటం జరిగింది.అలాగే ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించినదుకు హృదయపూర్వక వందనాలు తెలిపారు.

## అంగన్వాడీ టీచర్ల హామీలను నెరవేర్చాలని వినతి..



**నిజాంపేట,జూన్6(సూర్యరేఖ)**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్లు శనివారం నిజాంపేట తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ... తమకు ఈనెల1వ తేదీ నుంచే పెంచిన వేతనాలు చెల్లించాలన్నారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రవేశపెట్టిన 4,131 'పీఎం శ్రీ' ప్రీ-ప్రైమరీ కేంద్రాలను తక్షణమే రద్దు చేసి,ఆ బాధ్యతలను అంగన్‌వాడీలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మంగమ్మ, మణెమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి..



**నిజాంపేట, జూన్06 (సూర్యరేఖ)** మండల పరిధిలోని జెడ్ చెరువు తండా,నస్కల్,రాంపూర్,కాసిం పూర్ తండా,గ్రామాలలో శనివారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల్లో భాగంగా గ్రామసభలు నిర్వహించడం జరిగింది.ఈ మేరకు జెడ్ చెరువు తాండ గ్రామంలో తడి చెత్త,పొడి చెత్త ప్లాస్టిక్ పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేపట్టారు. గ్రామంలోని గ్రామస్తులు గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో రాజిరెడ్డి,ఎంపీఓ రజినీకాంత్ రెడ్డి, గ్రామసర్పంచ్ లు బాబు నాయక్,ప్రవీణ్,కనకరాజు,రామచందర్ నాయక్, నాతి అంజమ్మ,కార్యదర్శులు నాగలక్ష్మి,చంద్రహాస్,ప్రశాంత్ గౌడ్,భాస్కర్ రెడ్డి,అంగన్వాడీ టీచర్లు,ఆశ వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ సమగ్రాభివృద్దే లక్ష్యం..

అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి..

మూలమర్రి తండా సర్పంచ్ భూక్యా జానకీరాములు నాయక్

**మరిపెడ,జూన్06(సూర్యరేఖ)** గ్రామ పంచాయతీ సమగ్రాభివృద్దే లక్ష్యమని,అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భూక్యా జానకీరాములునాయక్ అన్నారు.ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మూలమర్రి తండా గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.గ్రామ సర్పంచ్ భూక్యా జానకీ రాములునాయక్ అధ్యక్షతన జరిగిన సభలో మొక్కల పెంపకం,ప్లాస్టిక్ నిషేధం,పరిసరాల పరిశుభ్రత,పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామ అభివృద్ధి,సమస్యలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జానకీ రాములునాయక్ మాట్లాడుతూ...గ్రామ అభివృద్దే ధ్యేయంగా ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి గ్రామసభ చక్కని వేదిక అని పేర్కొన్నారు.గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి,దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.గ్రామంలో పరిశుభ్రత పాటించడం,నీటి వృథాను అరికట్టడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించేందుకు ముందుకు రావాలన్నారు.రానున్న వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,సీజన్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించా



లన్నారు.రానున్న వర్షాకాలం నేపథ్యంలో వీధుల్లో చెత్త వేయవద్దు అన్నారు.తడి,పొడి చెత్తను వేరుచేసి చెత్త బండిలో వేయాలని కోరారు.గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తున్నామని,ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా కూడా తమ దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని,గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములై అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ జానకీ రాములు నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,కార్యదర్శి,ఏఈఓ,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న ఘనపూర్ లో గ్రామసభ..





**కొల్చారం,జూన్06(సూర్యరేఖ)**కొల్చారం మండలం చిన్న ఘనపూర్ గ్రామంలో శనివారం ఉదయం 11గంటలకు గ్రామ సభ నిర్వహించారు .గ్రామ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా గ్రామ సభలో పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామంలోని పారిశుద్ధ పనులు15 రోజులకు ఒకసారి మోరీలు తీసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ ట్రాక్టర్లో తడి పొడి చెత్త వేరువేరుగా వేయాలని సూచించారు.వచ్చే వర్షాకాలం సీజన్ కావడంతో దోమల బెడద, వీధిలైట్లు,ఏర్పాటు చేయాలని గ్రామసభ ముఖంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్,స్కూల్ టీచర్స్,అంగన్వాడి టీచర్లు,ఇతర సంబంధిత అధికారులు,కొల్చారం ఏవో శ్వేతకుమారి గ్రామ సభలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపాటు,ఉపసర్పంచ్ నర్సింలు,పంచాయతీ వార్డు మెంబర్లు,గ్రామప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్--సరోజ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు



**మందమర్రి,జూన్06(సూర్యరేఖ)** కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి--సరోజన దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మందమర్రి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించాయి.యాదృచ్ఛికంగా అదే రోజున ప్రపంచ వివాహ దినోత్సవం కూడా రావడంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీపంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,మహిళా నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.దంపతుల దాంపత్య జీవితం ఆనందంగా,ఆరోగ్యంగా కొనసాగాలని ప్రార్థనలు చేశారు."ప్రపంచ వివాహ దినోత్సవ శుభాకాంక్షలు"తెలియజేస్తూ మంత్రి దంపతులకు శుభాభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ ...సమాజ సేవలో మరింత ముందుకు సాగుతూ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.2023 సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి వివేక్ గెలుపులో మహిళా లోకం కీలక పాత్ర పోషించిందని,ముఖ్యంగా ఆయన భార్య సరోజన మహిళలను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెంచడంలో కీలకంగా పనిచేశారని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళా నాయకురాళ్లు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ ఘన విజయం..



**నాంపల్లి,హైదరాబాద్,జూన్06(సూర్యరేఖ)** తెలంగాణ జలమండలి(హెచ్ఎండబ్ల్యూ ఎస్ అండ్ ఎస్.బి)ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికల్లో ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) వర్గం ఘన విజయం సాధించింది.ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ మొగుళ్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో కార్మికులు త్రిశూలం గుర్తుకు పట్టం కట్టారని కార్వాన్ నియోజకవర్గం,జియాగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఐందాల మిత్ర కృష్ణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మిత్ర కృష్ణ మాట్లాడుతూ...ఈ విజయం ద్వారా కార్మికుల హక్కులు,ఉద్యోగ భద్రత,వేతనాల పెంపు,పెండింగ్ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైందన్నారు.కాంట్రాక్ట్ మరియు అవుట్సోర్సింగ్ కార్మికుల ఉద్యోగ భద్రతకు ఈ యూనియన్ పెద్దపీట వేసిందన్నారు.ఈ ఎన్నికల్లో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ విజయ దుందుభి మ్రోగించిందని, ఇది కార్మికుల విజయమని మిత్ర కృష్ణ పేర్కొన్నారు.ఇది 1947మే 3న మహాత్మా గాంధీ ఆశీస్సులతో జవహర్లాల్ నెహ్రూ,సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ వంటి ప్రముఖ నాయకుల చొరవతో స్థాపించబడిం దని,ఇది భారత జాతీయ కాంగ్రెస్ కు అనుబంధంగా పనిచేస్తున్న కార్మిక విభాగం అన్నారు.

## మహిళల భద్రత,సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన..





**బెల్లంపల్లి,జూన్06(సూర్యరేఖ)** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ రాధాగంబాల బస్తీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మహిళల భద్రత,సైబర్ నేరాలు,గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు రోడ్డు భద్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రయ్య,బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్,మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ ఛైర్మన్, స్థానిక కౌన్సిలర్,వార్డు పెద్దలు బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు,సైబర్ మోసాల నుంచి రక్షణ పొందే మార్గాలు,గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రజలు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని, పోలీసు శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను అభినందించారు.

## వర్షాలకు విరిగిపోయిన విద్యుత్ స్తంభం..





**నిజాంపేట,జూన్06(సూర్యరేఖ)** మొన్నకురిసిన భారీ వర్షాలకు నిజాంపేట మండలం నందిగామ గ్రామంలో విద్యుత్ స్తంభం వంగిపోయింది.అలాగే చౌకత్ పల్లి గ్రామంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం ట్రాన్స్ఫార్మర్ కింద పడిపోవడం జరిగింది.ఇది జరిగి రెండు రోజులు కావస్తున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజుల్లో తెలంగాణ రుతుపవనాలు వస్తున్నాయని వాతావరణశాఖ అధికారులు సూచించినప్పటికీ మళ్లీ వర్షాలు,ఈదురుగాలులు వీచినట్లయితే నందిగామలో స్తంభం కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం జరగకముందే గ్రామ పాలకవర్గం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని వారు కోరుతున్నారు.

## రైస్ మిల్లుల వద్ద పడి కాపులు..కేంద్రాల్లో లారీల కొరత..




**నిజాంపేట,జూన్06(సూర్యరేఖ)** మండలంలో కొనుగోలు కేంద్రాల నుంచి తరలించాల్సిన వరి ధాన్యం లారీల కొరతతో నిలిచిపోయింది.కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయినా రవాణా ఆలస్యం కావడంతో ధాన్యం అక్కడే ఉండిపోతున్నాయి.నందిగామ రైస్ మిల్లుల వద్ద కూడా లోడ్లు అన్లోడ్ కాక లారీలు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.మరో రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి రుతుపవనాలు వస్తున్నాయని వాతావరణశాఖ అధికారులు సూచించినప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం అలాగే నిల్వ ఉండడం ఈవర్షాలకు రైతులు ఇబ్బందులు గురవుతున్నారు.కావున రైస్ మిల్లు నిర్వాహకులు త్వరగా అన్లోడ్ చేయాలని రైతులు కోరుతున్నారు.

## గణాంకాల వెనుక దాగిన నిర్వహణ సింగరేణి సంస్థకు సవాళ్లు..

**మందమర్రి,జూన్06(సూర్యరేఖ)** సింగరేణిలో బొగ్గు నిల్వలు 26.51లక్షల టన్నులకు పడిపోవడం ఒక సాధారణ గణాంకం కాదు.ఇది దక్షిణ భారతదేశ విద్యుత్ వ్యవస్థకు కీలకమైన సరఫరా గొలుసులో ఏర్పడుతున్న ఒత్తిడిని సూచించే సంకేతం.సాధారణంగా 50లక్షల టన్నుల స్థాయిలో ఉండే నిల్వలు ఈసారి గణనీయంగా తగ్గడం, వర్షాకాలానికి ముందు ముందస్తు జాగ్రత్తల అవసరాన్ని మరింత స్పష్టంగా చూపిస్తోంది.వర్షాకాలంలో బొగ్గు తవ్వకాలు,రవాణా అంతరాయం కావడం సహజం.అందుకే కనీసం 30 లక్షల టన్నుల నిల్వలు అవసరమని సింగరేణి యాజమాన్యం చెప్పడం వాస్తవ పరిస్థితులపై ఆధారపడి ఉన్న అంచనా.అయితే ప్రస్తుత నిల్వలు ఆ పరిమితికి దగ్గరగా ఉండటం వల్ల ఉత్పత్తి--రవాణా సమన్వయం మరింత కీలకంగా మారింది.ఇది కేవలం ఉత్పత్తి సమస్య కాదు; సమగ్ర సరఫరా గొలుసు నిర్వహణ పరీక్ష కూడా.ఇక టెండర్ విధానంలో "సైట్ విజిట్ సర్టిఫికేట్"తప్పనిసరి చేయడం మరో ముఖ్యమైన మార్పు..ఓవర్ బర్డెన్ పనుల్లో గత అనుభవాలు చూపినట్టు,ప్రాజెక్ట్ స్థల పరిస్థితులను సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల పనులు మధ్యలో ఆగిపోవడం,ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురయ్యాయి.ఈ నేపథ్యంలో తీసుకున్న ఈనిర్ణయం కేవలం పరిపాలనా నియమం కాకుండా,ప్రాజెక్ట్ నిర్వహణలో ముందస్తు రిస్క్ నియంత్రణ చర్యగా చూడవచ్చు.. అయితే ఇలాంటి నిబంధనలు ఒకవైపు పారదర్శకతను పెంచే అవకాశం ఉన్నా,మరోవైపు ప్రక్రియను మరింత కఠినతరం చేస్తాయన్న విమర్శలు కూడా సహజమే.అందుకే సమతుల్యత అత్యంత అవసరం---పారదర్శకతను పెంచుతూనే అమలులో వేగం తగ్గకూడదు.ఇప్పటికే అరెస్టులు జరిగిన నేపథ్యంలో ఇది కేవలం వ్యక్తిగత స్థాయి తప్పిదంగా కాకుండా, వ్యవస్థాపరమైన సమీక్ష అవసరాన్ని సూచిస్తోంది.మొత్తంగా చూస్తే,సింగరేణి ప్రస్తుతం మూడు కీలక దశల్లో ఉంది.ఉత్పత్తి స్థిరత్వం,పాలసీ మార్పులు,పరిపాలనా పరిశీలనలు.ఈ మూడు అంశాలు ఒకే సమయంలో ముందుకు రావడం సంస్థకు ఒక పరీక్షా కాలాన్ని సూచిస్తోంది.బొగ్గు నిల్వల సమస్యను తాత్కాలికంగా కాకుండా దీర్ఘకాలిక వ్యూహంతో ఎదుర్కొనగలి గితేనే సింగరేణి తన సరఫరా స్థిరత్వాన్ని నిలబెట్టుకోగలదు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# గంజాయి,సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..






ఏసీపీ కిరణ్ కుమార్

**బెల్లంపల్లి,జూన్06(సూర్యరేఖ)**ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక--99రోజుల కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 29వ వార్డు పోస్టాఫీస్ బస్తీలో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి సహాయ పోలీసు కమిషనర్ వి.కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గంజాయి వినియోగం యువత భవిష్యత్తు,ఆరోగ్యం,కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సమాజంలో గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.అలాగే పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఆన్‌లైన్ మోసాలు,ఓటీపీ మోసాలు,నకిలీ పెట్టుబడి పథకాలు,సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనుమానాస్పద కాల్స్,సందేశాలు, లింక్‌లకు స్పందించవద్దని ,మోసాలకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.బెల్లంపల్లి ఒకటో పట్టణ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ...శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య,క్రీడలు, ఉపాధిపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు పిల్లల కదలికలను గమనించాలని చెప్పారు.మైనర్లు వాహనాలు నడపరాదని,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. మహిళలు, చిన్నారులు ఎలాంటి వేధింపులు ఎదురైనా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై సమాచారం తెలిసినా గోప్యంగా పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సహాయ ఉపఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్,ప్రధాన కానిస్టేబుల్ స్వప్న,కానిస్టేబుల్ గణేష్,వార్డు కౌన్సిలర్ పున్నం చంద్,మున్సిపల్ సిబ్బంది,స్థానిక ప్రజలు,యువత,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్‌కు రాక నేడే..!ఎంఎంసి భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి








ఉప్పల్ భగాయత్‌లో భారీగా ఏర్పాట్లు

**ఉప్పల్,జూన్06(సూర్యరేఖ)** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఆదివారం రానుండడంతో ఏర్పాట్లను ఎంఎంసీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి,జోనల్ కమిషనర్ రాధిక గుప్తా,ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ ,పోలీస్,ట్రాఫిక్ అధికారులు,డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ ,ఉప్పల్ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి లు పర్యవేక్షించారు. ఉప్పల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రానున్నారు. ఉప్పల్ భగాయత్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారు.ఆదివారం సాయంత్రం 5గంటలకు జరిగే కార్యక్రమానికి భగాయత్‌లో భారీగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎంఎంసీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి భగాయత్‌లో ఏర్పాట్లను పరిశీలించారు.కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ స్థలం,సభా వేదిక,ట్రాఫిక్,వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు.ఇదే కాకుండా సభకు వచ్చే వారి కోసం కూడా కావాల్సిన సౌకర్యాలను సైతం ఏర్పాటు చేశారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి..

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు





**మంచిర్యాల,జూన్06(సూర్యరేఖ)** రాష్ట్రంలో నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు అన్నారు.శనివారం హైదరాబాద్ నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు,ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్-2026పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు,వరి ధాన్యం కొనుగోలు,జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్-2026 పరీక్షకు 24పట్టణాలలో 208పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని,72వేల 956మంది విద్యార్థులు హాజరు కానున్నారని,ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని,రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని,వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు.ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని,పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని,అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు.పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు,అభ్యర్థుల రిజిస్ట్రేషన్,బయోమెట్రిక్ వెరిఫికేషన్,అభ్యర్థుల తనిఖీ,బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని,మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553బస్సులను మంజూరు చేయడం జరిగిందని,ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు.అదనపు డిజిపి మాట్లాడుతూ...పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని,సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...జిల్లాలో 1వేయి204 మంది అభ్యర్థులు నీట్-2026 పరీక్షకు హాజరు కానున్నారని,పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 5 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని,పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్,జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వి.రాములు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,జిల్లా విద్యాశాఖాధికారి లలిత, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి బ్రహ్మారావు,పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నాయకత్వానికి నేటి బాల పంచాయతీలే పునాది..

బాలల్లో నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యత పెంపొందించడమే లక్ష్యం..



**ఖమ్మం,జూన్06(సూర్యరేఖ)**నేటి బాలలే రేపటి నాయకులని,చిన్న వయస్సు నుంచే నాయకత్వ లక్షణాలు,క్రమశిక్షణ,సామాజిక బాధ్యతను అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సీఐడీ ఉమెన్ సేఫ్టీ వింగ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు.శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లపాడు--పోలేపల్లి గ్రామాల పరిధిలోని సిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల పంచాయతీ కార్యక్రమానికి బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారత రాణితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ...బాలల ఆలోచనలు, అభిప్రాయాలు సమాజాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.బాల పంచాయతీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు.విద్యతో పాటు నైతిక విలువలు,సామాజిక స్పృహను అలవర్చుకోవాలని, గ్రామాలు,పాఠశాలలు,సమాజ అభివృద్ధిలో తమవంతు బాధ్యతను గుర్తించి ముందుకు సాగాలని సూచించారు.బాలల హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి,పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యత, క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చన్నారు.అనంతరం ఎస్ఐ రాజారాం మాట్లాడుతూ...పిల్లల ఆలోచనల్లోనే సమాజ భవిష్యత్తు దాగి ఉందన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు బాలల హక్కులు, విద్య ప్రాధాన్యత,బాల్య వివాహాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ,గ్రామాభివృద్ధిలో యువత పాత్ర తదితర అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.కార్యక్రమంలో భరోసా ఎస్ఐ షాహినా, సర్పంచ్ శ్రావణి మహేష్,ఏఐడీ స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త కె. శ్రీనివాస్,వి.రాజేష్ ఫౌండేషన్ సమన్వయకర్త కె.సుజాత,ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పలత,ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం..

**మందమర్రి,జూన్06,(సూర్యరేఖ)** 2026--27విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ జి.దేవానంద్ తెలిపారు.ఈ మేరకు విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ ట్రేడ్లలో ప్రవేశాల కోసం అభ్యర్థులు మే25 నుంచి జూన్ 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. దరఖాస్తు ఫీజుగా రూ.100 చెల్లించాల్సి ఉంటుందని సూచించారు.మందమర్రి ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్,డీజిల్ మెకానిక్,సివిల్, డాక్యుమెంటేషన్,మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్,ఇండస్ట్రియల్ రోబోటిక్స్,బేసిక్ డిజైనర్,అడ్వాన్స్ టూల్స్ ఆర్టిజన్,మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటి పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్‌తో పాటు ఎస్ఎస్‌సీ మెమో,ఆధార్ కార్డు,స్టడీ సర్టిఫికెట్,కుల ధ్రువపత్రాలు,మొబైల్ నంబర్,ఈమెయిల్ ఐడీతో ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేయాలని ఆయన సూచించారు.

## శ్రీరేణుక ఎల్లమ్మ తల్లినీ దర్శించుకున్న కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్



**శివంపేట,జూన్06(సూర్యరేఖ)**నర్సాపూర్ నియోజకవర్గ శివంపేట మండలశీలోని పిల్లుట్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రేణుకఎల్లమ్మ తల్లి మొదటి వార్షికోత్సవం సందర్భంగా రెండవ రోజు ఎల్లమ్మతల్లి అమ్మవారిని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారి గంగాధర్ దర్శించుకుని అమ్మవారిని నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు,పిల్లుట్ల గ్రామం ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకోవడం జరిగింది.అలాగే ఈసారి కూడా చెరువులు,కుంటలు నిండి సుభిక్షంగా పంటలు పండాలని ఆఅమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకోవడం జరుగుతుంది..ఈ కార్యక్రమంలో బిజిఆర్ యువసేన అధ్యక్షులు కుమ్మరి నాగరాజు,గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర పోచగౌడ్,మాజీ ఉపసర్పంచ్ మహేష్ గౌడ్,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ బాచంపల్లి శ్రీధర్ గౌడ్,బిజెపి గ్రామకమిటీ అధ్యక్షులు బొందిల శ్రీనివాస్ గౌడ్,బుర్ర సత్యనారాయణగౌడ్,బుర్ర రాఘవేంద్రగౌడ్,కర్రే శ్రీకాంత్ గౌడ్,బుర్ర హరిశంకర్ గౌడ్,శివంపేట మండల జాతీయ మానవ హక్కుల కమిటీ అధ్యక్షులు సంద్ర సుదర్శన్,పిల్లి సురేష్,గాండ్ల దాసు,పెంటమ్మరాజు, సంతోష్ గౌడ సంఘం సభ్యులు తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# 2027నాటికి వ్యవసాయ విశ్వవిద్యాలయం10లోపు ర్యాంక్ సాధిస్తుంది..

**మొత్తం16మంది అసోసియేట్ డీన్,డైరక్టర్ లలో 8 మంది ఎస్,సీ,ఎస్టీల నియామకం ఇదే తొలిసారి..**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్ఫూర్తితోనే సామాజికన్యాయం అమలు చేస్తున్నాం..**

**వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి అల్దాస్ జానయ్య**







**రాజేంద్రనగర్,జూన్06(సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ వ్యవసాయ కళాశాలలకి అసోసియేట్ డీన్స్ గా,పరిశోధనా స్థానాల అసోసియేట్ డైరక్టర్లుగా నూతనంగా నియమితులైన ఎస్సీ,ఎస్టీ ఫ్యాకల్టీ సభ్యుల అభినందన,సన్మాన సభ రాజేంద్రనగర్ లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు.మొత్తం 16మంది అసోసియేట్ డీన్స్, అసోసియేట్ డైరక్టర్ స్ ఆఫ్ రీసెర్చ్ లో ఎనిమిది మంది ఎస్సి,ఎస్టీలే నియమితుల అవడం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇదే తొలిసారి అయిన సందర్భంగా విశ్వవిద్యాలయం ఎస్సీ,ఎస్టీ సెల్ మరియు విశ్వవిద్యాలయం బోధన,బోధనేతర ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హాజరు అయి రాష్ట్రం నలు మూలల నుంచి హాజరైన ఎస్సీ,ఎస్టీ బోధన,బోధనేతర సిబ్బంది,విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు.తాను బాధ్యతలు చేపట్టి నేటికి 18నెలల18రోజులు అయిందన్నారు .ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి స్ఫూర్తితోనే తాను విశ్వ విద్యాలయంలో అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిభ,సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడంల అన్న అంశాల ఆధారంగా నియామాకాలు చేపడుతున్నట్లు వివరించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అదే విధంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు,గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం వంటి వినూత్న కార్యక్రమాలతో రైతులతో నిత్యం మమేకం అవుతున్నామని వివరించారు.బోధన,బోధన,బోధనేతర సిబ్బంది సమిష్టి కృషితోనే ఇన్ని కార్యక్రమాలు చేపట్టగలిగామని అభిప్రాయపడ్డారు.అందరి కృషి వల్లనే గతంలో 37వ స్థానంలో ఉన్న విశ్వవిద్యాలయం గత ఏడాది 24వ ర్యాంక్ సాధించిందన్నారు.ఈ ఏడాది 20లోపు ర్యాంక్ సాధిస్తుందని,2027లో పదిలోపు ర్యాంక్ ని విశ్వవిద్యాలయం సాధిస్తుందని అల్దాస్ జానయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.కొత్తగా నియమితులైన వారు ఈ అవకాశాలని,అధికారాల్ని నీతి,నిజాయితీ, నిబద్ధతలతో బాధ్యత లని నిర్వర్తించి తెలంగాణా ప్రజల ఆస్తి అయిన ఈ విశ్వ విద్యాలయం ఖ్యాతి ని మరింత పెంచాలని అల్దాస్ జానయ్య పిలుపు ఇచ్చారు.ఈ సందర్భంగా రాజ్యాంగ అసలు ప్రతిని అల్దాస్ జానయ్య విడుదల చేశారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు ఉపకులపతిని సన్మానించారు.అభినవ అంబేద్కర్ గా అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జిఈ సిహెచ్ విద్యాసాగర్, రాజేంద్రనగర్ కళాశాల అసోసియేట్ డీన్ సి.నరేంద్ర రెడ్డి,విశ్వవిద్యాలయ అధికారులు,ఎస్సీ,ఎస్టీ సెల్ ఆఫీసర్ ఇన్ చార్జి ఎం.రాజేశ్వర నాయక్,ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.ప్రవీణ్ కుమార్, ఎస్,ఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.బాలాజీ నాయక్, బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.పరమేశ్వర్ వందన సమర్పణ చేశారు.

# గంజాయి రహిత మండలంగా మరిపెడను తీర్చిదిద్దుదాం..





**మరిపెడ,జూన్06(సూర్యరేఖ)** ఫోర్త్ ఎస్టేట్ పోలీసులకు సహకరించాలి.. గంజాయి వినియోగంపై కఠిన నిఘా.. మరిపెడకు గంజాయి టెస్టింగ్ కిట్స్.. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం.. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచాలి.. యువత పెడదారి పట్టకుండా రక్షించాలి.. మరిపెడ సీఐ పవన్ కుమార్ గంజాయి వినియోగాన్ని నియంత్రించి మరిపెడను గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దుదామని,ఆరోగ్యసమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ,నిషేధిత మత్తు పదార్థాల నుంచి యువత దూరంగా ఉండాలని మరిపెడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.పవన్ కుమార్ సూచించారు.శనివారం మరిపెడ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జిల్లా ఎస్పీడా.శబరిష్ నేతృత్వంలో గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసుశాఖ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు.పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో యువత పెడదారి పట్టకుండా ఫోర్త్ ఎస్టేట్ పోలీసులు సహకరించాలని కోరారు.మరిపెడ మండలంలో గంజాయివినియోగం, రవాణా,విక్రయాలను పూర్తిగా నిర్మూలించి మరిపెడను గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు పోలీసుశాఖ పటిష్ట చర్యలు చేపడుతుందని, అందులో భాగంగా గంజాయి గుర్తింపునకు ఉపయోగపడే అత్యాధునిక గంజాయి టెస్టింగ్ కిట్లు ప్రస్తుతం మరిపెడ పోలీసుశాఖకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పోలీసు సిబ్బంది ఈకిట్లను విధుల్లో భాగంగా వెంట తీసుకెళ్తూ అనుమానిత వ్యక్తులు లేదా పదార్థాలను అక్కడికక్కడే పరీక్షించి కేవలం10నిమిషాల్లో ఫలితాలు పొందగలరని చెప్పారు.దీంతో గంజాయి సేవిస్తున్న వారిని, గంజాయి కలిగి ఉన్న వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం మరింత సులభమవుతుందని తెలిపారు. మత్తు పదార్థాల అలవాటు నుండి బయటపడాలనుకునే వారు లేదా వారి కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదిస్తే కౌన్సెలింగ్,వైద్య సహాయం, సంబంధిత డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా పునరావాస సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.గంజాయి సేవించడం ,నిల్వ ఉంచడం,విక్రయించడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.మండలంలో ఎక్కడైనా గంజాయి విక్రయం,వినియోగం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచాలని,గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు.సమాజ శ్రేయస్సు,యువత భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి మరిపెడను గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని సీఐ పవన్ కుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ గంద్రాతి సతీష్,అదనపు ఎస్ఐ మహబూబి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై తహశీల్దార్ కు రైతుల పిర్యాదు..




**మరిపెడ,జూన్06(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మరిపెడ మండలంలోని తాళ్ల ఉకల్ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై అదే గ్రామానికి చెందిన కొంత మంది రైతులు తహశీల్దార్ కృష్ణవేణి పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకంలో తేడా జరిగాయని,రైతులకు సుమారు 60బస్తాల ధాన్యం తేడా వస్తుందని ఆరోపించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం చేయడం వల్ల రోజుల తరబడి కేంద్రాల వద్దే నిరీక్షించాల్సి వచ్చిందన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు కోడికంటిసతీష్,రమేష్,బి.మధుసూదన్,కే.మల్లయ్య,బి.హరి,కొమరమల్లు,నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలు రాలేకపోయారు లోపం ఎక్కడ..?

**గ్రామసభ అంటే టెంటు వేయని పరిస్థితి..**

**ఎండలో నిలబడి సమస్యలు విన్న ప్రజలు..?**



**కొల్చారం,జూన్06(సూర్యరేఖ)** గ్రామాల్లో జరుగుతున్న గ్రామసభలు నిజంగా ప్రజల సమస్యలు పరిష్కరించే వేదికల మారుతున్నాయా.? లేక కేవలం అధికారిక కార్యక్రమాలుగా ముగిసిపోతున్నాయా..?ఇప్పుడు ఈప్రశ్న చిన్నఘనపూర్ గ్రామంలో బలంగా వినిపిస్తుంది.గ్రామసభ స్థానిక సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సభకు ప్రజల నుండి స్పందన లేకపోవడం దురదృష్టకరం అధికారులు వచ్చిన సమస్య ఉన్నా కూడా ప్రశ్న అడిగే ప్రజలు లేకపోవడంతో అధికారులకు ఏసమస్య తెలియకపోవడంతో అధికారులు ఎలాంటి సమాధానం లేకుండానే గ్రామసభను జరిపించారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణలో భాగంగా గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించినప్పటికీ కూడా గ్రామ సభలకు ప్రజలు రాలేకపోవుచున్నారంటే లోపం ఎక్కడ..?శనివారం చిన్న గణనాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభ వివిధ శాఖల అధికారులు పాలక మండలి సభ్యులు సర్పంచ్ ఉపసర్పంచ్ తో కొనసాగించారు. గ్రామసభ అంటే ప్రజలు ఎండలో నిలబడి వినే కార్యక్రమం కాదు.ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం గ్రామ కార్యదర్శి బాధ్యత. టెంటు లేదా షామియానా ఏర్పాటు చేయాలి,గ్రామపంచాయతీ కార్యాలయం ముందు టెంటు లేదా షామియానా ఏర్పాటు కూడా చేయలేని పరిస్థితి గ్రామ పంచాయతీ కార్యదర్శి పనితీరుకు నిదర్శనమని గ్రామ ప్రజలు అంటున్నారు

## బదిలీపై వెళుతున్న వర్క్‌షాప్ డివైజీఎంకు ఘనమైన ఆత్మీయ వీడ్కోలు..



**మందమర్రి,జూన్06(సూర్యరేఖ)** మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో డివైజీఎం (డిప్యూటీ జనరల్ మేనేజర్)గా విధులు నిర్వహించి, ప్రమోషన్‌పై గోదావరిఖని ఆడ్రియాల ప్రాజెక్టుకు ఏరియా ఇంజనీర్‌గా బదిలీ అవుతున్న వి.ధూప్ సింగ్‌కు యూనియన్లకు అతీతంగా ఘనమైన వీడ్కోలు సన్మానం నిర్వహించారు.శనివారం వర్క్‌షాప్ కార్యాలయ సిబ్బంది జాడి సంతోష్,బి. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లోని ఇంజనీర్లు, సూపర్వైజర్లు,ఆఫీస్ సిబ్బంది,వివిధ సెక్షన్ల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధూప్ సింగ్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలు,జ్ఞాపికలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నాయకులు ధూప్ సింగ్ సేవలను ప్రశంసించారు. ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు భీమనాధుని సుదర్శన్,వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి సిహెచ్ శర్మ, ఐఎన్టీయూసీ నాయకుడు దేవి భూమయ్య, టిబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్‌తో పాటు సిఐటియు నాయకులు మాట్లాడుతూ...ధూప్ సింగ్ తన పదవీకాలంలో కార్మికులతో సమన్వయంగా పనిచేసి అన్ని వర్గాలతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారని అన్నారు.అతని ప్రమోషన్‌పై బదిలీ ఆనందకరమైనదైనా, వర్క్‌షాప్‌కు ఇది ఒక భావోద్వేగ క్షణమని పేర్కొన్నారు.ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకుంటూ భవిష్యత్ బాధ్యతల్లో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముల్కలపల్లి వెంకటేశ్వర్లు,తోట వెంకటస్వామి,సేఫ్టీ కమిటీ సభ్యులు టేకుమట్ల తిరుపతి,కన్నం వేణు, కొండు వెంకటేష్,రాజన్న, దుర్గాప్రసాద్‌తో పాటు వర్క్‌మెన్ కమిటీ సభ్యులు, అనేక మంది కార్మికులు పాల్గొన్నారు.బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ వర్క్‌షాప్‌లు,132 కేవీ సబ్‌స్టేషన్, గ్యారేజ్, పంపు,ఎలక్ట్రికల్,ఫ్యాబ్రికేషన్, మిషనిస్ట్ సెక్షన్ల సిబ్బంది అందరూ కలిసి ధూప్ సింగ్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

## పుచ్చిపోయిన జిలుగులు ఇచ్చారంటున్న రైతులు

**రైతులు మొరపెట్టుకున్న పట్టించుకోని వ్యవసాయ అధికారులు**

**సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన గోకవరం రైతులు**



**ఖమ్మం,జూన్06(సూర్యరేఖ):**కల్లూరు మండల పరిధి లోని కొర్లగూడెం సొసైటీ వారి వద్ద నుండి గోకవరం రామకృష్ణాపురం రైతులు జీలుగులను రూ.2450 కొనుగోలు చేశారు.వాటిని ఇంటికి వచ్చే పరిశీలించగా 70% పుచ్చులు కనిపిస్తున్నాయి ఏమిటి అని వ్యవసాయ అధికారిని అడగగా దురుసుగా సమాధానం ఇస్తున్నారని,సంబంధిత ఏఈఓకు,సమాచారం అడగగా తాము ఏమి చేసేది లేదని,కల్లూరు వ్యవసాయ అధికారిణి రూపాను అడగమని సమాధానం చెప్పారని రైతులు తెలుపుతున్నారు .జూలుగులు రిటన్ ఇస్తే డబ్బులు ఇస్తామని దురుసుగా సమాధానం చెబుతున్నారు.రైతు బాధ పొలం దున్నుటకు రూ.3 వేల రూపాయలు ఖర్చు వస్తుందని,జీలుగులకి రూ.2460,ఒక ఎకరానికి రైతు ఖర్చు రూ.5460 వస్తుందన్నారు.పంటకాలం సమీపిస్తుంది,కొందరు రైతులు చల్లిన జిలుగులు మొలక రాలేదు,ఈ విషయంపై కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ విషయంపై సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.ఫిర్యాదు చేసిన వారిలో రైతులు మారుతి,సత్యం,యామా రమేష్,గుగులోతు సైదా,గుగులోతు సీను,గుగులోతు హరి,మారుతీ, రాము, నరేష్,గుగులోతు రాములు,బానోతు బద్రు,బానోతు రాములు ఉన్నారు.

# ప్రమాదకరంగా మారిన భారీ వృక్షాలు..





భయాందోళనలో సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వాసులు

**మందమర్రి,జూన్06(సూర్యరేఖ)** సింగరేణి ఏరియాలోని సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ పరిసరాల్లో ఉన్న దశాబ్దాల నాటి భారీ వృక్షాలు స్థానిక బస్తీ వాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి.ఎండాకాలంలోనే బలమైన ఈదురుగాలులకు భారీ కొమ్మలు విరిగి పడుతుండటంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇటీవల కొమ్మలు విరిగి ఇళ్ల సమీపంలో పడిన ఘటనలు చోటుచేసుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో స్థానికులు వణికిపోతున్నారు.క్వార్టర్స్ మధ్యలో విస్తరించిన పాత వృక్షాలు ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకున్నాయని వారు చెబుతున్నారు.రానున్న వర్షాకాలంలో భారీ ఈదురుగాలులు,వర్షాల కారణంగా చెట్లు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ పరిస్థితిలో ఇళ్లపై చెట్లు పడితే ప్రాణ,ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు,మహిళలు,వృద్ధులు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో ప్రతిసారి గాలి వీచినప్పుడూ భయంతో జీవించాల్సిన పరిస్థితి నెలకొన్నదని స్థానికులు పేర్కొన్నారు.ఇప్పటికే పలుమార్లు చెట్ల కొమ్మలు విరిగి పడినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించలేదని వారు ఆరోపిస్తున్నారు.ప్రమాదం జరిగాక చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే ప్రమాదకర వృక్షాలను గుర్తించి తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.భారీ ప్రమాదం జరగకముందే అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి బస్తీ వాసుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ప్రజాహితమే ప్రజాప్రభుత్వ లక్ష్యం..





ప్రజాసమస్యల పరిష్కారానికి వార్డు సభలు..
మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతిశ్రీపాల్ రెడ్డి

**మరిపెడ,జూన్06(సూర్యరేఖ)** ప్రజాహితమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మరిపెడ పట్టణంలోని 5,6,7,8వ వార్డుల్లో శనివారం వార్డు సభలు నిర్వహించారు.ఈ సభల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వార్డుల అభివృద్ధి,పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా,విద్య,వైద్య సేవలు,సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు వార్డు సభలు ఉపయోగపడతాయని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఛైర్‌పర్సన్ సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,తహసీల్దార్ కృష్ణవేణి,సీఐ పవన్ కుమార్,ఎస్సై సతీష్,కమిషనర్ నరేష్ రెడ్డి,ఎంఈఓ అనిత రెడ్డి,వైద్యాధికారి స్వామి,ఏఈఓ అరవింద్,వార్డు కౌన్సిలర్లు కాంతమ్మ కరణ్ సింగ్,బోడ భాస్కర్,పానుగోతు రాములు,నీలా లచ్చిరామ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ సర్పంచులు,అంగన్‌వాడీ సిబ్బంది,ఆర్పీలు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల అమ్మకాలు వ్యాపారంగా మారాయి..

అధికారులు చర్యలు తీసుకోవాలి : పి.డి.ఎస్.యు.జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్రా అశోక్ కుమార్



**ఆదిలాబాద్,జూన్06(సూర్యరేఖ)** కొమరంభీమ్ భవన్,దస్నాపూర్‌లోని పిడిఎస్ యు జిల్లా కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి ముఖ్యనాయకుల సమావేశంలో జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి,విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పిడి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్రా అశోక్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.పాఠశాల యాజమా న్యాలు నిర్దిష్ట బుక్ స్టాల్స్‌లోనే పుస్తకాలు, నోట్‌బుక్స్,యూనిఫాంలు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను బలవంతపెడుతున్నాయని ఆయన ఆరోపించారు.మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చడం దురదృష్టకర మన్నారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన తరగతి గదులు, తాగునీరు,మరుగుదొడ్లు,విద్యుత్,డిజిటల్ విద్యా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి విద్యా ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు. అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను అరికట్టి,ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యా హక్కుచట్టం మరియు ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయడంతో పాటు,తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు.విద్యను సేవగా చూడాలని, వ్యాపారంగా మార్చరాదని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు,తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు సిడాం సాయికుమార్,జిల్లా నాయకులు కృష్ణ,రజనీకాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారిగా విధులు...కళాకారుడిగా వేదికపై మెరుపులు



**మందమర్రి,జూన్06(సూర్యరేఖ)** సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఐఈడి డీజీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కాందారి కిరణ్ కుమార్,తన అధికార హోదాను మించి కళారంగం లోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.రోజువారీ పరిపాలనా పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ,సాంస్కృతిక కార్యక్రమాల్లో మాత్రం ఆయనలోని కళాకారుడు వెలుగొందుతున్నాడు.సింగరేణి కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక వేదికల్లో పాల్గొంటూ,కార్మికులతో కలిసి నటించడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది.అధికారి అనే హోదాను పక్కన పెట్టి సహచర కార్మికులతో సమానంగా వేదికను పంచుకోవడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల సింగరేణి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన చేసిన నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.ముఖ్యంగా అంబేద్కర్,రైతు పాత్రల్లో ఆయన ప్రదర్శించిన సహజ నటన సభలో భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించింది.పాత్రల ఆంతర్యాన్ని అర్థం చేసుకుని జీవించిన తీరు ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. గతంలో కూడా పలు కార్యక్రమాల్లో ఆయన తన నటనా ప్రతిభను ప్రదర్శించారు.అయితే ఒక ఉన్నతాధికారి స్వయంగా వేదికపైకి వచ్చి కార్మికులతో కలిసి నటించడం సంస్థలో సానుకూల చర్చకు దారితీసింది.ఇది అధికార--కార్మిక సంబంధాలను మరింత దగ్గర చేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ....కళలు సమాజానికి అత్యంత వేగంగా చేరువయ్యే శక్తివంతమైన సాధనమని అన్నారు.కళల ద్వారా ప్రజల్లో అవగాహన,చైతన్యం తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ అవకాశాలను కల్పిస్తున్న సహచర అధికారులు,సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.హోదా ఎంత ఉన్నా, మనసులో ఉన్న కళను వెలికితీయగలిగితే అది సమాజానికి సందేశంగా మారుతుందని కాందారి కిరణ్ కుమార్ తన నటనతో మరోసారి చాటిచెప్పారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం..



**ఉట్నూర్,మే 06(సూర్యరేఖ)** ఉట్నూర్ మండలంలోని పులిమడుగు,ఏంకా ఇంద్రవెల్లి మండలంలోని ఇంద్రవెల్లి,దస్నాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆశాఖ డిఈ రామ సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.

## వేసవి తపనకు చల్లని ముగింపు...

మంచిర్యాలలో ఉచిత అంబలి సేవా కార్యక్రమం సమాప్తం..



**మంచిర్యాల, జూన్06 (సూర్యరేఖ)**మంచి ర్యాలలో వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కొరత,ఎండ తీవ్రత నుంచి ఉపశమ నం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం ఘనంగా ముగిసింది.కీ.శే కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులకు,సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు.వేసవి తాపాన్ని తగ్గిస్తూ ప్రజలకు ఉపశమనం కలిగించిన ఈ ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందనను అందుకుంది.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బస్టాండ్,మార్కెట్,ఐబీ చౌరస్తా, హమాలీవాడ,సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ కాలనీతో పాటు లక్షెట్టిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో వేసవి అంతా అంబలి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు చల్లదనాన్ని అందించారు.దాదాపు 41 రోజుల పాటు మంచిర్యాలలో,37రోజుల పాటు లక్షెట్టిపేటలో ఈ సేవా కార్యక్రమం కొనసాగింది. శనివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కార్పొరేటర్లు,నాయకులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్,కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు తూముల నరేష్ మాట్లాడుతూ... ప్రజల కోసం వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ఈ అంబలి పంపిణీ సేవా కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలిచిందని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు.

# రామాయంపేటను సుందరీకరిస్తాం..





**రామాయంపేట,జూన్06(సూర్యరేఖ)** ఆదర్శ మున్సిపల్'గా తీర్చి దిద్దుతాం..సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు.. నగర అభివృద్ధి కింద రూ.15కోట్లు మంజూరు.. ఐదేళ్లుగా రామాయంపేట వెనుకబాటు.. గత ప్రభుత్వంలో నిధులు రాక రోడ్లు బాగుపడలే..ఎమ్మెల్యే మైనంపల్లి సహకారంతో ముందడుగు.. ప్రజా సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగనివ్వం.. పక్షపాతం లేకుండా అన్ని వార్డుల్లో పనులు ప్రగతి ప్రణాళిక-ప్రజాపాలనలో మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్యానాగరాజు రామాయంపేటను ఆదర్శపట్టణంగా తీర్చి దిద్దుతాం. మూడు దశాబ్దాలుగా ముందడుగు వేయని రామాయంపేటను సుందరీకరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్యానాగరాజు పేర్కొన్నారు.రామాయంపేటలోని వైశ్యభవన్ లో శనివారం 10,11,12వార్డుల వారీగా ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జరిగింది.దీనిలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ తోపాటు మూడు వార్డుల కౌన్సిలర్లు కో- ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ...నగర అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఐదేళ్లుగా నిధులు రాక వెనుకబాటు..గత బిఆర్ఎస్ పాలనలో నిధులు రాక రామాయంపేట మున్సిపల్ వెనుకబాటుకు గురైందని గజవాడ లావణ్య నాగరాజు అన్నారు.మూడు దశాబ్దాలుగా ముందడుగు వేణి పట్టణాన్ని తమ హయాంలో అభివృద్ధి ఏమిటో చూపిస్తామన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో అభివృద్ధి.. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో రామాయంపేట మున్సిపల్ అభివృద్ధి,సుందరీకరణ చేస్తామని గజవాడ లావణ్య నాగరాజు స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగనివ్వం..ప్రజా సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగనివ్వమన్నారు.అన్ని వార్డులకు సంబంధించి వెంట వెంటనే పనులు చేసి పెట్టేలా అధికారులకు సూచనలు చేస్తున్నట్లు గజవాడ లావణ్య నాగరాజు తెలిపారు.పార్టీ బేధం లేకుండా వార్డుల్లో పనులు.. పార్టీల భేదం,పక్షపాత ధోరణి లేకుండా పట్టణ అభివృద్ధి పనులు సాగుతాయని లావణ్య నాగరాజు పేర్కొన్నారు.ఇళ్లల్లో బాత్రూంలు నిర్మిస్తే ఉచితంగా ఇటుక సరఫరా చేస్తా..కౌన్సిలర్ డాకి శ్యామల స్వామి 11వ వార్డులో తమ ఇళ్లల్లో బాత్ రూమ్ లు లేనివారు కట్టుకోవాలని కౌన్సిలర్ డాకీ శ్యామల స్వామి అన్నారు.ఇందుకు తన వంతు సహకారంగా కావాల్సినంత ఇటుకను ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. పదవ వార్డులో రోడ్లు,డ్రైనేజీ సమస్య..కౌన్సిలర్ మద్దెల మాధవి రమేష్ పదవ వార్డులో చాలా ఏళ్లుగా డ్రైనేజీ రోడ్ల సమస్య ఉందని కౌన్సిలర్ మద్దెల మాధవి రమేష్ కమిషనర్,చైర్ పర్సన్ దృష్టికి తెచ్చారు.తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రధాన సమస్యలు తీర్చేలా చూడాలని కోరారు.తనపై నమ్మకం ఉంచి గెలిపించిన వార్డు సమస్యలు తీర్చే లక్ష్యంగానే పని జరగాలని ఆకాంక్షించారు.అభివృద్ధి పనులే ప్రభుత్వలక్ష్యం..కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదగిరి.అభివృద్ధి పనులే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళు తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదగిరి అన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి..

డీఎం అండ్ హెచ్ఓను కోరిన కామన్ ప్లాట్‌ఫాం ఎన్జీవో క్రాంతివర్మ



**రాజేంద్రనగర్,జూన్06(సూర్యరేఖ)**ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని,సామాన్యుడు ఆసుపత్రికి వెళితే భారమైన ఫీజులు చెల్లించలేని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని కామన్ ప్లాట్‌ఫాం ఎన్జీవో క్రాంతివర్మ అన్నారు.ఈ మేరకు శనివారం ఆయన డీఎం అండ్ హెచ్ఓను కలిసి ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని వివరించి,ఈ మేరకు ప్రైవేట్ ఆసుపత్రులను కట్టడి చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు,డయాగ్నస్టిక్ సెంటర్లు,ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అధిక రుసుములు వసూలు చేస్తూ ప్రజలను ఆర్థికంగా దోచుకుంటున్నాయని,వీటిపై తక్షణ చర్యలు కోరామన్నారు.క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2010,రూల్ 9(అ)ప్రకారం ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి రేటు చార్టులను తెలుగు,హిందీ,ఇంగ్లీష్ 3 భాషల్లో ప్రదర్శించడం తప్పనిసరి అని,కానీ జిల్లాలో 90% ఆసుపత్రులు ఈ నిబంధన పాటించడం లేదన్నారు.చిన్న పరీక్షలకు కూడా భారీ బిల్లులు,అనవసరమైన టెస్టుల పేరుతో దోపిడీ,బిల్లింగ్‌లో పారదర్శకత లేకపోవడం,అత్యవసర సమయాల్లో రోగుల బలహీనతను అవకాశంగా తీసుకుంటున్నారని మండిపడ్డారు.అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని,3 భాషల్లో రేటు చార్టులు పెట్టని ఆసుపత్రుల లైసెన్స్ రద్దు చేయాలని,అనవసర టెస్టులు రాస్తున్న ఆసుపత్రులపై జరిమానా విధించాలన్నారు.రోగుల ఫిర్యాదుల కోసం జిల్లా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని,బస్తీ దవాఖానాలు,పీహెచ్ సీలలో ఉచిత సేవలపై ఉదయం,సాయంత్రం మైక్ ప్రచారం చేయాలని డిమాండ్ చేశారు.రోగం ఒక ఎత్తైతే,ప్రైవేట్ ఆసుపత్రి బిల్లు మరో ఎత్తని,పేదవాడు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని,ప్రభుత్వ బస్తీ దవాఖానాల్లో ఉచితంగా దొరికే సేవలను ప్రజలకు తెలియజేయకపోవడం వల్లే ప్రైవేట్ దోపిడీ పెరిగిందన్నారు.15 రోజుల్లో చర్యలు తీసుకోకపోతే కలెక్టర్,వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ లకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

# ఘనంగా ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ పుట్టినరోజు వేడుకలు పాల్గొన్న బిఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్





**ఉట్నూర్,జూన్06(సూర్యరేఖ):** ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలంలోని ప్రభుత్వ హాస్పిటల్లో మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పంద్ర జైవంత్ రావు,బీఆర్ఎస్,బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి పేషెంట్లకు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్,పంద్ర జైవంత్ రావు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పంద్ర జైవంత్ రావు,ధరణి రాజేష్ లు మాట్లాడుతూ..ప్రజా సేవకు నిర్వచనం,నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు రూపం,ప్రజల నాయకులు జాన్సన్ నాయక్ అని తెలిపారు.వారు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యలతో సుఖ సంతోషాలతో బాగుండాలని,ప్రజా సేవలో మరింత ముందు ఉండి ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కూర్సెంగ భూమన్న,మాజీ ఎంపీటీసీ అమీనాభి,సడిగే రాజ్ కుమార్,దూట మహేందర్, సిడం సోనే రావు,జాదవ్ రవి,బొడ్డు నరేష్,కమేరి రాజు,సాజిద్ సాధని,సురేష్ రాథోడ్,అన్వేష్, జాదవ్, గిరి నాయక్,రామ్ కోటేష్, శంశీర్,వినయ్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల,జూన్06(సూర్యరేఖ)**వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్,లతో కలిసి ఆసుపత్రుల అభివృద్ధి సంఘం సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి అభివృద్ధి పనులకు గాను అవసరమైన బడ్జెట్ కేటాయింపు కొరకు ప్రతిపాదించడం జరిగిందని,ఇందులో భాగంగా ఆసుపత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్,సిబ్బంది నియామకం,ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ ఇతర అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు కొరకు 2 కోట్ల 88లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని,ఆసుపత్రి పరిసరాలలో ఉమ్ము వేసిన వారికి జరిమానా విధించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారలు తదితరులు పాల్గొన్నారు.

## హస్నాబాద్ గ్రామంలో మితిమీరిన సర్పంచ్ భర్త అక్రమ లావాదేవీలు

ప్రశ్నిస్తే దాడులు,బెదిరింపులకు పాల్పడుతున్న వైనం




**అందోల్,జూన్06(సూర్యరేఖ):**సం గారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం హస్నాబాద్ గ్రామంలో సర్పంచ్ భర్త ఆగడాలు మితిమీరిపోతు న్నాయి .తన ఇష్టం వచ్చినట్లు చేస్తా,అడిగితే దౌర్జన్యాలు,దాడులకు పాల్పడుతు న్నారని ఆరోపణలు వినిపిస్తున్నా యి.15 వ ఆర్థిక సంఘం నిధులను ప్రస్తుత సర్పంచ్ భర్త,మాజీ సర్పంచ్ హనుమంత్ కాజేశారని,మొత్తం గ్రామానికి 15 వ ఆర్థిక సంఘం కేంద్ర బడ్జెట్ కేటాయించిన రూ.16.3 లక్షల పాత బకాయిలు అంటూ స్పెషల్ ఆఫీసర్ పాలనలో స్వంతంగా వేశానని,హై మాస్ట లైట్ల పేరుతో మొత్తం మాజీ సర్పంచ్ హనుమంత్ తన స్వంత డబ్బులతో వేయిస్తున్నట్లు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తిరిగి సర్పంచ్ గా వారి హనుమంత్ భార్య తులసి గెలవడంతో అక్రమాలకు తెరలేపారన్నారు. కనీసం రోడ్లు వేస్తే నాణ్యత లేకుండా పోయాయని తెలిపారు.15 వ ఆర్థిక సంగం డబ్బులు రూ.6.5 లక్షల డబ్బులు తీసుకున్నారని,స్పెషల్ ఆఫీసర్ పాలనలో అని చెబుతూ దాటవేస్తున్నారన్నారు.గ్రామానికి సంబంధించిన గ్రూపులో జర్నలిస్ట్ శేఖర్ ప్రశ్నిస్తే అనుచితంగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారని తెలుస్తుంది.కావున కాజేసిన వారిపై వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ వెంటనే వీరిపై చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ..





**రాజేంద్రనగర్,జూన్06(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యటించారు.స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు.కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించి,స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో భాగంగా కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ,తాగునీటి సరఫరా,వీధి దీపాల (విద్యుత్ దీపాలు) పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆరా తీశారు.స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్న ఆయన,అక్కడికక్కడే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనపై తక్షణమే దృష్టి సారించాలని,పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ప్రాధాన్యతగా పని చేయాలన్నారు.కాలనీల్లో డ్రైనేజీ,రోడ్లు,తాగునీరు,విద్యుత్ వంటి కనీస వసతుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు.అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

కాలనీల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంబడి అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య,మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్ దాస్ గౌడ్,డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ,టి.ప్రేమ్ గౌడ్,అడికె అర్జున్, సరికొండ వెంకటేష్,అడికే శ్రీనివాస్, లక్ష్మారెడ్డి,భాషా,శ్రీనివాస్,రాజు,మహేష్ గౌడ్,



శేఖర్,శ్రీకాంత్,మానస,లావణ్య,సునీత,ఈఈ,జల మండలి అధికారులు,విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# విధి రాసిన చివరి పేజీ...





**ఇంటి గుమ్మం చేరకముందే ఆగిపోయిన యువ పోలీసు జీవితం..**

**మరో ఐదు నిమిషాల్లో ఇంటి ముంగిట ఉండాల్సిన కొడుకు...రక్తపు మడుగులో నిర్జీవంగా మారాడు!..**

**విధులు ముగించుకుని వస్తుండగా లారీ చక్రాల కింద నలిగి కానిస్టేబుల్ మహిపాల్ మృతి..**

**18 నెలల క్రితమే ఖాకీ తొడిగిన యువకుడి ప్రాణం రోడ్డు ప్రమాదంలో బలి..**

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు... కోమటిపల్లిలో విషాద ఛాయలు..**

**రామాయంపేట,జూన్06(సూర్యరేఖ)** విధి ఆడిన వింత నాటకంలో ఓ యువ పోలీసు జీవితం అర్ధాంతరంగా ముగిసింది.మరో ఐదు నిమిషాల్లో తన ఇంటి గుమ్మం దాటాల్సిన కొడుకు, క్షణాల్లోనే మృత్యువు ఒడిలోకి జారిపోయాడు. కుటుంబ సభ్యుల కళ్లల్లో ఎన్నో ఆశలు నింపిన యువ కానిస్టేబుల్ మహిపాల్ (28)రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో రామాయంపేట మున్సిపల్ పరిధిలోని కోమటిపల్లి గ్రామం శోకసంద్రంగా మారింది.మెదక్ జిల్లా శివంపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహిపాల్ శుక్రవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని తన స్వగ్రామం కోమటిపల్లికి బైక్‌పై బయలుదేరాడు.రామాయంపేట శివారుకు చేరుకుని, ఇంకొన్ని నిమిషాల్లో ఇంటికి చేరుకుంటాననే సమయంలో ఎదురుగా వచ్చిన లారీ అతని జీవితాన్ని చిదిమేసింది.అదుపు తప్పిన లారీ చక్రాల కింద మహిపాల్ నలిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.18 నెలల క్రితమే ఖాకీ దుస్తులు...అంతలోనే అంతిమయాత్ర

ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలన్న ఆశతో పోలీస్ శాఖలో చేరిన మహిపాల్‌కు విధి క్రూరంగా వ్యవహరించింది.కేవలం18నెలల క్రితమే పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా నియమితుడైన ఆయన,సేవా జీవితాన్ని ప్రారంభించిన కొద్ది కాలంలోనే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం సహచర పోలీసులను,గ్రామస్తులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

**కన్నీటి వీడ్కోలు..**



మహిపాల్ మృతదేహం స్వగ్రామం కోమటిపల్లికి చేరుకోగానే గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది.కుటుంబ సభ్యుల రోదనలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి.యువకుడైన కొడుకును కోల్పోయిన తల్లిదండ్రుల ఆర్తనాదాలు హృదయాలను కదిలించాయి.గ్రామస్తులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి చివరి చూపు చూసి నివాళులర్పించారు.

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు..**

మహిపాల్ అంత్యక్రియలు పోలీస్ అధికార లాంఛనాలతో నిర్వహించారు.అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు సహా పలువురు పోలీస్ అధికారులు హాజరై పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.సహచర పోలీసులు గౌరవ వందనం సమర్పించగా,విషాద వాతావరణంలో అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి.

**ఖాకీ కలలకు అర్ధాంతర ముగింపు**

కుటుంబ భవిష్యత్తుకు భరోసాగా నిలవాల్సిన యువ కానిస్టేబుల్ మహిపాల్ జీవితం రోడ్డు ప్రమాద రూపంలో విషాదాంతం కావడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.ఇంటికి చేరే క్షణాల ముందే మృత్యువు కబళించడంతో కోమటిపల్లి గ్రామం కన్నీటి సంద్రంగా మారింది. ఖాకీ దుస్తుల్లో ప్రజలకు సేవ చేయాలన్న యువకుడి కలలు, విధి రాసిన ఒకే ఒక్క క్షణంలో శాశ్వతంగా ముగిసిపోయాయి.

## డివిజన్ కాంగ్రెస్ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడిన మాటలు హాస్యాస్పదము..

**హితువు పలకడం మా నాయకుడికి కాదు..మీ నాయకునికి చెప్పుకోండి..**

**కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్**



**రాజేంద్రనగర్,జూన్06(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని,కేవలం ఎమ్మెల్యేను వెనుకేసుకొచ్చే ధోరణితోనే అనవసర ఆరోపణలు చేస్తున్నారని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభివృద్ధిని గాలికి వదిలి తన అనుచరులకు కాంట్రాక్టులు అప్పజెబుతూ అక్రమంగా ప్రజాధనాన్ని దోచుకుంటు న్నారని ఆరోపించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..2007 లో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభమైతే ఇప్పుడు వరకు పూర్తిగాకుండా ఉందంటే బాధ్యత ఎవరిదో మీకు తెలియాలన్నారు.అదేవిదంగా నర్సబాయ్ కుంట విషయంలో కూడా ఎమ్మెల్యే అలసత్వం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సుదీర్ఘంగా 2009 నుంచి 4 పర్యాయాలు శాసనసభ్యులు ఎవరూ మీరు తెలుసుకుని మాట్లాడాలన్నారు.అంతే తప్ప అసత్య ఆరోపణలు హితువులు శుద్ధ పూస మాటలు వల్లించవద్దన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధి ఎందుకు కుంటుపడిందని,మాటలు,చేష్టలు ప్రజలందరూ గమనిస్తూ ఉన్నారన్నారు.రాబోయే రోజుల్లో మీకు చరమగీతం పాడటం గ్యారంటీ అని జోష్యం చెప్పారు.తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఫ్లైఓవర్లు నిర్మాణ పూర్తయ్యాయి గాని రాజేంద్రనగర్ లో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మాత్రం పూర్తికాలేదన్నారు.ఇందుకు స్థానిక శాసనసభ్యులు బాధ్యత వహించాలన్నారు.ప్రజాపాలన అని చెప్పుకుంటున్న మీరు అభివృద్ధిని అడుగడుగున అడ్డుకుంటూ ప్రజల జీవన శైలిని పరీక్షిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఎక్కడి కక్కడ ప్రవహిస్తున్నాయని,కృష్ణ,గోదావరి నదులు లాగా దోమలు బెడద,నిత్యం కరెంటు కోతలతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. హితువులు, సందేశాలు, బోధనలు ఎమ్మెల్యేకు తెలియజేయాలని,ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.

## ఎరువులు,విత్తనాలు సకాలంలో అందించాలి

**అఖిల భారత ఐక్య రైతు సంఘం దామరగిద్ద మండల కమిటీ**



**దామరగిద్ద,జూన్06(సూర్యరేఖ):** వర్షాకాలం ఖరీఫ్ సీజన్ సంబంధించి ఎరువులు విత్తనాలు సకాలంలో అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం దామరగిద్ద మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు.ఈ మేరకు దామరగిద్ద మండల తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.అలాగే డిఏపి ఒక బస్తా రూ.1350 ఇవ్వాలని,పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలని,పాత స్టాకు ఉన్నందున పాత ధరకు ఇవ్వాలని,కొత్త స్టాక్ ఇంకా రాలేదు,ఫర్టిలైజర్ దుకాణ యజమానులు పెరిగిన ఎరువుల ధరలు ఇప్పుడే అమలు చేస్తున్నారని,ఒక సంచిని రూ.1650,1800,2000 లకు అమ్ముతున్నారని,రైతులు చాలా నష్టపోతున్నారని అన్నారు.కందులు,పెసలు నాలుగు కిలోల బస్తా గత సంవత్సరం రూ.450,రూ.500 ఉంటే ఈ సంవత్సరం రూ.700,రూ.750 అమ్ముతున్నారని ఫెర్టిలైజర్ షాపులను నియంత్రించాలని రైతులకు గిట్టుబాటు ధరలు చెల్లించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం దామరగిద్ద మండల కమిటీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దింటి తాయప్ప,శాఖ బాల్రాజ్,కంసాన్పల్లి మల్లప్ప,లింగడిపల్లి అనంతమ్మ,బాపనపల్లి నరసప్ప,ఉడుమల్ గిద్ద అలీసా,మిగతా చాలామంది రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

**హైదరాబాద్ :** తెలంగాణలోని పలు జిల్లాలలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాన కారణంగా అనేక చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు పట్టణాలు, గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో సాధారణ జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, కరీంనగర్ పట్టణం, హుజూరాబాద్, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలతో పాటు ములుగు జిల్లాలోని మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల రోడ్లు వాగులను తలపించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

## సింగరేణిలో భారీ కుంభకోణం.. రూ.1,600 కోట్ల

**బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్**

**ఖమ్మం :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారుసింగరేణిలోని పలు స్టాక్‌యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు.ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి

# టాలీవుడ్ హీరోయిన్ల పాత్రలపై విమర్శలు.. గట్టి కౌంటర్ ఇచ్చిన నటి ఆషికా రంగనాథ్!



సౌత్ ఇండియన్ కమర్షియల్ సినిమాలలో, ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరోల చిత్రాలలో హీరోయిన్ల పాత్రల నిడివి, వారి ఎంపికలపై వచ్చే విమర్శలకు ప్రముఖ నటి ఆషికా రంగనాథ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి టాప్ స్టార్స్ సరసన కేవలం భారీ రెమ్యునరేషన్, క్రేజ్ కోసమే హీరోయిన్లు నటిస్తున్నారని, నటనకు స్కోప్ లేని పాత్రలను గుడ్డిగా ఒప్పుకుంటున్నారని విమర్శకులు చేసే ఆరోపణలను ఆమె తీవ్రంగా తిప్పికొట్టారు. నటీమణులకు మద్దతుగా పరిశ్రమలోని అసలు వాస్తవాలను వివరిస్తూ ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు ప్రాధాన్యత లేకుండా పోవడానికి నటీమణులను నిందించడం ముమ్మాటికీ తప్పని, దీని వెనుక సినిమా ఇండస్ట్రీ నడిచే ఒక పెద్ద వ్యాపార వ్యవస్థ ఉందని ఆషికా పేర్కొన్నారు. చాలా మంది హీరోయిన్లకు ఇలాంటి భారీ పాన్-ఇండియా సినిమాల్లో నటించడం అనేది కేవలం నటనకు సంబంధించిన ఎంపిక మాత్రమే కాదని, తమ కెరీర్‌ను మార్కెట్‌లో నిలబెట్టుకోవడానికి చేసే ఒక వ్యూహాత్మక నిర్ణయమని (హ్రీఫ్వస్త్రఅష స్పష్టం చేశారు. సాధారణంగా పెద్ద కమర్షియల్ చిత్రాలలో హీరోయిన్ పాత్రలు కేవలం యాక్షన్ సీక్వెన్స్‌ల మధ్యలో వచ్చే గ్లామరస్ విరామాలు లాంటివని, హీరోయిన్ స్వంత ఇమేజ్ కంటే హీరో ఎలివేషన్‌ను పెంచేలాగే ఆ పాత్రలను చాలా జాగ్రత్తగా డిజైన్ చేస్తారని అభిప్రాయపడ్డారు. అందుకే నటీమణులపై అనవసర నిందలు వేయడం ఆపి, ఇప్పటికీ ఇలాంటి గ్లామర్ పాత్రలనే ప్రేక్షకులు ఇష్టపడతారని నమ్ముతున్న మేకర్స్‌ను, ఈ పాతకాలపు వ్యవస్థను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. నటీనటులు ఎప్పుడైనా తమకు వచ్చే అవకాశాల పరిధిలోనే బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తారని, పెద్ద ప్రాజెక్ట్‌లలో భాగమవడం ద్వారా దేశవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తారని తెలిపారు. ఒక సినిమాలో హీరోయిన్ పాత్ర సరిగ్గా రాయబడకపోతే ఆ తప్పు రచయితలు, దర్శకులదే కానీ.. ఆ పాత్రల్లో నటించిన మహిళలది కాదని ఆషికా రంగనాథ్ చెప్పుకోచ్చారు.




## మూడు భాషల్లో డబ్బింగ్ చెప్పిన విజయ్ సేతుపతి.. జూన్ 8న 'స్లమ్‌డాగ్' టీజర్

టాలీవుడ్ దర్శకుడు పూరీ జగన్నాథ్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ప్యాన్ ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్ర టీజర్ కోసం నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి డబ్బింగ్ పూర్తి చేసినట్లు పూరీ జగన్నాథ్ శనివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ అప్‌డేట్‌లో అసలు విషయం ఏంటంటే.. విజయ్ సేతుపతి కేవలం ఒక భాషలోనే కాకుండా ఏకంగా మూడు భాషల్లో (తెలుగు, తమిళం, హిందీ) స్వయంగా డబ్బింగ్ చెప్పారు. ఈ విషయాన్ని పూరీ జగన్నాథ్ తన ఎక్స్ ఖాతాలో పంచుకుంటూ, విజయ్ సేతుపతి తన సొంత వాయిస్‌తో మూడు భాషల టీజర్‌కు అద్భుతమైన వాయిస్‌ను అందించారని, ఈ చిత్ర టీజర్‌ను జూన్ 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గతేడాది జూలైలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రేక్షకుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిగా ముగిసిందని, ప్రస్తుతం అన్ని భాషలకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి స్టైలిష్ గాగుల్స్ ధరించి, చేతిలో రక్తం అంటిన కత్తితో, కరెన్సీ నోట్ల పెట్టెల మధ్య నిలబడి ఉన్న లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రొల్ల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేబీ మోషన్ పిక్చర్స్ భాగస్వామ్యంతో ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటి టబు, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరి పాత్రలు కథను మలుపు తిప్పే విధంగా ఎంతో బలంగా ఉంటాయని సమాచారం. హీరోయిన్ సంయుక్త పాత్ర ఎమోషనల్ గా, నటనకు మంచి స్కోప్ ఉన్నదిగా ఉంటుందని, ఈ పాత్ర పట్ల ఆమె ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో తన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.




## సుడిగాలి సుధీర్‌కి జోడీగా బిగ్ బాస్ బ్యూటీ

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'సుధీర్స్ జోకర్' చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన 'సుధీర్స్ జోకర్' మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

## సమాజంలో మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతోంది.. బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్



సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ద్వంద్వ ప్రమాణాలపై, పితృస్వామ్య మనస్తత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురీ దీక్షిత్. ప్రేమ, బంధాల విషయంలో పురుషులను ఒకలా, స్త్రీలను మరోలా చూసే వివక్ష సమాజంలో ఇంకా బలంగా నాటుకుపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పురుషుల శృంగార ఎంపికలను సమాజం గొప్పగా చూస్తుందని, అదే సమయంలో మహిళలు అలాంటి ఎంపికలు చేసుకుంటే తప్పుగా చిత్రీకరిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఇది పూర్తిగా పితృస్వామ్య సమాజమని, కాలం మారుతున్నా మొదటి నుంచి ఉన్న ఆ పాత ఆలోచనలే కొనసాగుతున్నాయని విమర్శించారు. పురుషుడికి ఎక్కువ మంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉంటే అతడిని 'క్యాసనోవా' అని పిలుస్తూ గొప్పగా చూస్తారని, అదే ఒక మహిళకు ఎక్కువ మంది బాయ్‌ఫ్రెండ్స్ ఉంటే ఆమెను ఎంతో నెగెటివ్‌గా చూస్తూ రకరకాల పేర్లతో దూషిస్తారని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తన తాజా చిత్రం 'మా బెహన్' సమాజం సృష్టించిన ఇలాంటి సాంప్రదాయ నిబంధనలను, కట్టుబాట్లను బద్దలు కొడుతుందని 59 ఏళ్ల మాధురీ దీక్షిత్ తెలిపారు. ఈ సినిమాలో సమాజం సృష్టించిన ప్రతి నియమాన్ని తాము బ్రేక్ చేశామని, ఆ పాత్రలు చేస్తున్నప్పుడు తాము ఎంతో ఆనందించామని చెప్పారు. ఇందులోని పాత్రలు ఎంతో గందరగోళంగా, నిజ జీవితంలో ఉండే సాధారణ మనుషులకు ఎంతో దగ్గరగా, రిలేటబుల్‌గా ఉంటాయని ఆమె వివరించారు. సురేష్ త్రివేణి దర్శకత్వంలో తెరకెక్కిన 'మా బెహన్' ఒక బ్లాక్ కామెడీ థ్రిల్లర్ చిత్రం. ఇందులో మాధురీ దీక్షిత్‌తో పాటు తృప్తి డిమ్రి, ధరణ దుర్గా, రవి కిషన్, గీతాంజలి కుల్కర్ణి, అరుణోదయ్ సింగ్, శార్దూల్ భరద్వాజ్ కీలక పాత్రలు పోషించారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713